దేశరాజధాని ఢిల్లీలో
ఈరోజు బంగారం ధర
తులం బంగారం
(10 గ్రాములు)
1,41,300/-
(22 క్యారెట్స్)
1,54,150/-
(24 క్యారెట్స్)


# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక: 50 | ఎడిటర్: మేనం శ్యామ్ | మంగళవారం 08-09-2026 | పేజీలు: 10


## సిరా చుక్క

శాసనసభనా.. కౌరవ సభనా?
ఆ రోజు ద్రౌపది కన్నీరు కార్చింది..
ఈ రోజు ప్రజాస్వామ్యం
కన్నీరు కారుస్తోంది..!
అప్పుడు చీర లాగారు..
ఇప్పుడు మహిళా గౌరవాన్నే
లాగుతున్నారా?
సబితమ్మ గొంతు నొక్కితే..
సునీతమ్మ చీర లాగితే..
అది ఇద్దరి అవమానం కాదు..
తెలంగాణ ఆడబిడ్డల
ఆత్మగౌరవానికి గాయం..!
మహిళా నాయకురాళ్లపై
మగ పోలీసుల చేతులు
ఎందుకు పడాలి?
తోపులాటలో ఇనుప చువ్వలపై పడే
పరిస్థితి రావడం దురదృష్టకరం..!
అక్కడ ఓ మహిళా ఎమ్మెల్యే
చేయి పట్టి కాపాడింది..
అది మహిళా ఐక్యతకు
నిలువెత్తు నిదర్శనం..!
అధికారం శాశ్వతం కాదు..
కుర్చీ శాశ్వతం కాదు..
చరిత్ర అన్నీ గుర్తుపెట్టుకుంటుంది..!
శాసనసభలో వాదనలు ఉండాలి..
వేదనలు కాదు..
మహిళను అవమానించిన క్షణం..
ప్రజాస్వామ్యమే తలవంచిన క్షణం..!




కాతోజు వినోద్ కుమార్. ....
అన్నారం, మిర్యాలగూడ

# స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై తాతా మధు వ్యాఖ్యలు..

# అసెంబ్లీలో భావోద్వేగం





**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. స్పీకర్ కుటుంబాన్ని, ముఖ్యంగా ఆయన తల్లిని కించపరిచేలా తాతా మధు వ్యాఖ్యలు చేసినట్లు అధికార కాంగ్రెస్ వర్గాలు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

- స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు
- వ్యాఖ్యలపై తీవ్ర మనస్తాపానికి గురైన స్పీకర్ గడ్డం ప్రసాద్
- అసెంబ్లీలో భావోద్వేగానికి గురై కన్నీరు పెట్టుకున్న స్పీకర్
- తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క డిమాండ్
- మండలి నుంచి తాతా మధును బహిష్కరించే యోచనలో చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

### అసెంబ్లీలో భావోద్వేగానికి గురైన స్పీకర్..

తాతా మధు వ్యాఖ్యలతో తీవ్ర మనస్తాపానికి గురైన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అసెంబ్లీలో భావోద్వేగానికి లోనయ్యారు. మంత్రి సీతక్క ప్రసంగిస్తున్న సమయంలో ఒక్కసారిగా కంటతడి పెట్టుకున్నారు. దీంతో సభలో కొద్దిసేపు భావోద్వేగ వాతావరణం నెలకొంది. స్పీకర్‌ను చూసి మంత్రి సీతక్క సైతం కన్నీరు పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

### తాతా మధుపై చర్యలకు సీతక్క డిమాండ్..

స్పీకర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని మంత్రి సీతక్క అన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ తల్లిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన స్పీకర్ పదవికి గౌరవం ఉండేలా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పేర్కొన్నారు.

### సీఎంవో విడుదల చేసిన వీడియోతో కలకలం..

ఇదిలా ఉండగా.. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేసిన వీడియోను సీఎంవో విడుదల చేసింది. ఈ వీడియో రాజకీయ వర్గాల్లో మరింత చర్చకు దారితీసింది. దీంతో తాతా మధుపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు మరింత పెరిగాయి.

### బహిష్కరణకు సిద్ధమవుతున్న మండలి చైర్మన్?

తాతా మధు వ్యాఖ్యలపై శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి చర్యలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న చైర్మన్.. తాతా మధును శాసన మండలి నుంచి బహిష్కరించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై అధికారికంగా తుది నిర్ణయం వెలువడాల్సి ఉంది.

# స్పీకర్ అవమానంపై సీఎం రేవంత్ ఫైర్

- కేసీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలి

- తాతా మధు వ్యాఖ్యలపై అసెంబ్లీలో తీవ్ర దుమారం
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీని డిస్మిస్ చేయాలని సీఎం డిమాండ్
- కేసీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని రేవంత్‌రెడ్డి డిమాండ్
- స్పీకర్ చైర్ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని వ్యాఖ్య
- తాతా మధును సమర్థించాలని బీజేపీ చూస్తోందా? అని ప్రశ్న



**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ అసెంబ్లీలో తీవ్ర దుమారం చెలరేగింది. ఈ అంశంపై ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సభలో తీవ్రస్థాయిలో స్పందించారు. స్పీకర్ చైర్‌ను అవమానించేలా అత్యంత అసభ్యకరమైన భాషను ఉపయోగించారని మండిపడ్డారు. ఇది కేవలం స్పీకర్‌కు జరిగిన అవమానం కాదని.. నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి జరిగిన అవమానమని వ్యాఖ్యానించారు.

### బీజేపీపై సీఎం తీవ్ర ఆరోపణలు...

చీకటి మిత్రులను కాపాడేందుకు

మిగతా 2లో

# స్పీకర్‌పై వ్యాఖ్యలు..

## బీఆర్ఎస్‌పై శ్రీధర్‌బాబు ఫైర్

- స్పీకర్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దుర్భాషలాడారని మంత్రి శ్రీధర్‌బాబు ఆగ్రహం
- తాతా మధు వ్యాఖ్యలపై అందరం మనస్తాపం చెందామని వెల్లడి
- స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదని స్పష్టం
- బీజేపీ వైఖరి చెప్పాలని మంత్రి డిమాండ్
- శ్రీధర్‌బాబు ప్రసంగాన్ని అడ్డుకున్న బీజేపీ సభ్యులు సభలో గందరగోళం



**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** బీజేపీ ఎమ్మెల్యేల ఆందోళనలతో వాయిదా పడిన తెలంగాణ శాసనసభ తిరిగి ప్రారంభమైంది. సభ ప్రారంభమైన అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యల అంశం చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దుర్భాషలాడారని మండిపడ్డారు.

మిగతా 2లో

# తాతా మధు వ్యాఖ్యలను ఖండించిన ఏలేటి..

## కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్

- స్పీకర్‌పై తాతా మధు వ్యాఖ్యలను బీజేపీ ఎమ్మెల్యేలంతా ఖండిస్తున్నారని ఏలేటి వెల్లడి
- తాతా మధును బర్తరఫ్ చేయాలని డిమాండ్
- ప్రతిపక్ష నేత కేసీఆర్ సైతం క్షమాపణ చెప్పాలని ఏలేటి వ్యాఖ్య
- 22వ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్
- ధరణిపై ఫోరెన్సిక్ ఆడిట్ జరిగితే నివేదికను బహిర్గతం చేయాలని ప్రశ్న



**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. సోమవారం శాసనసభలో మాట్లాడిన ఆయన.. స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు ఆ విధంగా మాట్లాడటం సరికాదన్నారు. మధు మాట్లాడిన భాషను

మిగతా 2లో

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు హైకోర్టులో ఊరట

- అడ్డుకోవద్దని పోలీసులకు ఆదేశాలు
- నల్ల టీషర్టులతో అసెంబ్లీకి వెళ్లేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల యత్నం
- అసెంబ్లీ గేటు వద్ద ఎమ్మెల్యేలను అడ్డుకున్న పోలీసులు
- పోలీసుల తీరుపై హైకోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- ఎమ్మెల్యేలను అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డుకోవద్దని హైకోర్టు ఆదేశం
- మహిళా ఎమ్మెల్యేలపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఆదేశం

2లో

## గణేశ్ ఉత్సవాలకు పటిష్ట భద్రత

- డీజీపీ సీవీ ఆనంద్ కీలక ఆదేశాలు
- సెప్టెంబరు 14 నుంచి గణేశ్ ఉత్సవాలు.. 25న నిమజ్జనం
- మండపాల ఏర్పాట్ల నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశం
- మండపాల వివరాల పర్యవేక్షణకు ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్
- మండపాలను జియో ట్యాగింగ్ చేసి భద్రతా ఏర్పాట్ల వివరాలు నమోదు చేయాలని సూచన
- నిమజ్జన మార్గాల్లో బాంబ్ డిస్పోజల్ బృందాలు, డాగ్ స్క్వాడ్‌లను వినియోగించాలని ఆదేశం

2లో

## తెలంగాణ ఓటర్ల జాబితాపై ఈసీ కీలక నిర్ణయం

- క్లెయిమ్స్, అభ్యంతరాల గడువు పొడిగింపు
- క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ గడువు అక్టోబర్ 7 వరకు పొడిగింపు
- తొలుత సెప్టెంబర్ 16 వరకు గడువు
- నవంబర్ 5లోగా క్లెయిమ్స్, అభ్యంతరాల పరిశీలన పూర్తి
- నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల
- తెలంగాణలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ఈసీ కీలక నిర్ణయం

2లో

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయలేదు

- తాతా మధు కీలక వివరణ
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి తాను ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదన్న తాతా మధు
- అసెంబ్లీ బయట తాను అనని మాటలను తనకు ఆపాదిస్తున్నారని వెల్లడి
- స్పీకర్ వ్యవస్థతో పాటు గడ్డం ప్రసాద్‌పై తనకు ఎంతో గౌరవం ఉందని స్పష్టం
- తన వ్యాఖ్యల్లో ఏవైనా అభ్యంతరకరంగా ఉంటే ఉపసంహరించుకుంటానని ప్రకటన
- తన వైఖరిని స్పష్టం చేసేందుకే ఈ వివరణ ఇస్తున్నట్లు వెల్లడి

2లో

## లండన్ ఉద్యోగాల పేరుతో రూ.15 లక్షల మోసం.. యూట్యూబర్ రమా నందన అదుపులోకి

- లండన్‌లో ఉద్యోగాలు, వీసాలు ఇప్పిస్తానంటూ డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు
- లుక్‌ఔట్ నోటీసులతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నందనను అదుపులోకి తీసుకున్న విమానాశ్రయ పోలీసులు
- యూకే ఉద్యోగం, వీసా, స్పాన్సర్‌షిప్ పేరుతో రూ.15 లక్షలు తీసుకున్నట్లు ఫిర్యాదు
- రూ.2 లక్షలు మాత్రమే తిరిగి ఇచ్చి.. మిగతా రూ.13 లక్షలు ఇవ్వలేదని బాధితుడి ఆరోపణ

2లో

# గణేశ్ ఉత్సవాలకు పటిష్ట భద్రత

**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** గణేశ్ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టాలని డీజీపీ సీవీ ఆనంద్ పోలీసు అధికారులను ఆదేశించారు. మండపాల ఏర్పాటు నుంచి గణేశ్ నిమజ్జనం పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెప్టెంబరు 14 నుంచి ఉత్సవాలు ప్రారంభం కానుండగా.. 25న నిమజ్జనం నిర్వహించనున్న నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో బందోబస్తు ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.



**మండపాల వివరాల కోసం ప్రత్యేక పోర్టల్..**

డీజీపీ కార్యాలయం నుంచి రాష్ట్రంలోని పోలీసు ఉన్నతాధికారులతో సీవీ ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసే గణేశ్ మండపాల వివరాలను సేకరించి పర్యవేక్షించేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, నిర్వాహకులు, కమిటీ సభ్యులు, నిమజ్జనానికి వినియోగించే వాహనాల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.సీపీలు, డీసీపీలు, ఎస్పీలు స్వయంగా మండపాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించాలని డీజీపీ ఆదేశించారు. తనిఖీలకు సంబంధించిన వివరాలను పాయింట్ బుక్స్‌లో నమోదు చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసే మండపాలను జియో ట్యాగింగ్ చేసి.. ఆయా ప్రాంతాల్లో చేపట్టిన భద్రతా ఏర్పాట్ల వివరాలను నమోదు చేయాలని తెలిపారు. జియో ట్యాగింగ్, తనిఖీల వివరాలను టీజీ-కాప్ వేదికలోనూ అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

**విద్యుత్తు భద్రతపై ప్రత్యేక దృష్టి..**

గణేశ్ మండపాల వద్ద విద్యుత్తు భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీవీ ఆనంద్ సూచించారు. విద్యుత్తు, అగ్నిమాపక తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మండపాల వద్ద నిర్వాహకులు స్వచ్ఛంద కార్యకర్తలను ఏర్పాటు చేసుకునేలా చూడాలని తెలిపారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి భద్రతను పర్యవేక్షించాలని సూచించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో క్యూల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.

**నిమజ్జన మార్గాల్లో ప్రత్యేక నిఘా..**

గణేశ్ నిమజ్జనం సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున నిమజ్జన మార్గాలు, ప్రధాన రహదారులు, వంతెనలను ముందుగానే గుర్తించాలని డీజీపీ సూచించారు. ఆయా మార్గాల సామర్థ్యాన్ని పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించాలని ఆదేశించారు.

**అనుమానాస్పద కదలికలపై నిఘా..**

భద్రతా చర్యల్లో భాగంగా అవసరమైన ప్రాంతాల్లో బాంబ్ డిస్పోజల్ బృందాలు, డాగ్ స్క్వాడ్‌లను వినియోగించాలని సీవీ ఆనంద్ ఆదేశించారు. అనుమానాస్పద వస్తువులు, వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. ఉత్సవాలు, నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు డీజీపీ స్పష్టం చేశారు.

# 'దుశ్శాసన సభగా మార్చారు'..
# కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

- బీఆర్ఎస్ శ్రేణులపై పోలీసులు కిరాతకంగా వ్యవహరించారని కేటీఆర్ ఆరోపణ
- అసెంబ్లీని 'దుశ్శాసన సభ'గా మార్చేశారని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శ
- మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల తీరును సమాజం గమనించిందని వ్యాఖ్య
- సభలో జరిగిన ఘటనకు సీఎం రేవంత్ రెడ్డే బాధ్యుడని ఆరోపణ
- రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పే వరకు సభలో నిలదీస్తామని కేటీఆర్ స్పష్టం



**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** తెలంగాణ శాసనసభలో కాంగ్రెస్ ప్రభుత్వం, నిరసనలు చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులపై పోలీసులు కిరాతకంగా వ్యవహరించారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీని 'దుశ్శాసన సభ'గా మార్చివేసిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన పోలీసు బృందం కిరాతకంగా వ్యవహరించిందని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.

**కేసీఆర్ సూచనతోనే ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన..**

అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ ఎంతగా రెచ్చగొట్టినా ప్రజాస్వామ్యబద్ధంగానే వ్యవహరించాలని తమ అధినేత కేసీఆర్ సూచించారని కేటీఆర్ తెలిపారు. నాడు పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ టీషర్టులు ధరించి నిరసన తెలిపిన తరహాలోనే తాము కూడా అసెంబ్లీకి వెళ్లామని స్పష్టం చేశారు. తమను ఏ నిబంధన ప్రకారం అడ్డుకున్నారో చెప్పేందుకు అధికారుల వద్ద సమాధానం లేదని అన్నారు.

**మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల తీరుపై ఆగ్రహం..**

అజాతశత్రువులుగా పేరున్న మాజీ మంత్రులు, మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును సమాజం నిశితంగా గమనించిందని కేటీఆర్ అన్నారు. టీషర్టులపై ఎలాంటి అభ్యంతరకర పదాలు లేవని.. అవి అభ్యంతరకరంగా ఉన్నాయని చెప్పడానికి డీసీపీ శిల్పవల్లి ఎవరు? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డిని నిలదీస్తామనే భయంతోనే తమను అడ్డుకున్నారని ఆరోపించారు.

**సభలో గలాటాకు సీఎం రేవంతే కారణం..**

అసెంబ్లీలో జరిగిన గలాటాకు ఆద్యుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డేనని కేటీఆర్ విమర్శించారు. గతంలో తాను, జగదీష్ రెడ్డి డీకే అరుణకు క్షమాపణలు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు సభలో జరిగిన ఘటనపై రేవంత్ రెడ్డి స్పందించి క్షమాపణ చెప్పే వరకు వదిలిపెట్టేది లేదన్నారు. సభలో ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

**రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి..**

సర్వభ్రష్ట ప్రభుత్వంగా పేరు తెచ్చుకున్న రేవంత్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సభలో జరిగిన ఘటనకు ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని అన్నారు. ప్రభుత్వ వైఖరిని ప్రజల ముందు ఎండగడతామని స్పష్టం చేశారు.

# తాతా మధు వ్యాఖ్యలను ఖండించిన ఏలేటి..
# కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్

**మొదటి పేజీ తరువాయి**

బీజేపీ ఎమ్మెల్యేలంతా తీవ్రంగా ఖండిస్తున్నారని తెలిపారు.
తాతా మధును బర్తరఫ్ చేయాలి..తాతా మధు కావాలనే అలా మాట్లాడారా? లేక ఎవరైనా మాట్లాడించారా? అని ఏలేటి ప్రశ్నించారు. స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయన్ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా క్షమాపణలు చెప్పాలని కోరారు.

**22ఏ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణ..**

22ఏ అంశంపై స్వయంగా మంత్రి క్షమాపణలు చెప్పారని ఏలేటి గుర్తు చేశారు. 22ఏ నెపాన్ని అధికారులపై మోపేందుకు ప్రయత్నిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు హామీ ఇస్తే తమ ఆందోళన విరమిస్తామని స్పష్టం చేశారు.

**డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారంటూ విమర్శ..**

తమ డిమాండ్‌కు సమాధానం చెప్పకుండా అధికార పక్షం ఏదేదో మాట్లాడుతోందని ఏలేటి విమర్శించారు. అసలు అంశాన్ని పక్కదారి పట్టిస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు

**ధరణి ఫోరెన్సిక్ ఆడిట్ నివేదిక ఎక్కడ?..**

ధరణిపై ఫోరెన్సిక్ ఆడిట్ జరిగిందా? అని ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. ఒకవేళ ఆడిట్ జరిగితే ఆ నివేదికను పబ్లిక్ డొమైన్‌లో ఎందుకు పెట్టలేదని నిలదీశారు. ధరణి ఫోరెన్సిక్ ఆడిట్‌కు సంబంధించిన నివేదికలను ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు హైకోర్టులో ఊరట

**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** సోమవారం ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వాడివేడిగా జరిగాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్ల టీషర్టులు ధరించి శాసనసభలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే వారిని అసెంబ్లీ గేటు వద్దే పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.



**హైకోర్టును ఆశ్రయించిన ఎమ్మెల్యేలు..**

తమను అసెంబ్లీలోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. హోంశాఖ ప్రభుత్వ న్యాయవాదికి నోటీసులు జారీ చేసింది. అనంతరం ఎమ్మెల్యేలను అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డుకోవద్దని పోలీసులను ఆదేశించింది.

**నిబంధనలు ఉల్లంఘిస్తే స్పీకరే చర్యలు తీసుకోవాలి..**

ఎమ్మెల్యేలు సభా నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు మాత్రమే ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. శాసనసభ్యులపై పోలీసులు చర్యలు తీసుకోవద్దని పేర్కొంది. అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవడం సరికాదని ధర్మాసనం స్పష్టం చేసింది.

**మహిళా ఎమ్మెల్యేలపై దాడిపై హైకోర్టు ఆగ్రహం..**

ఘటన సందర్భంగా మహిళా శాసన సభ్యులపై దాడి చేసిన పోలీసులను గుర్తించాలని హోంశాఖను హైకోర్టు ఆదేశించింది. దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించింది. ఈ ఘటనకు సంబంధించి సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించాలని డీజీపీకి సూచించింది.

**రెండు వారాలకు విచారణ వాయిదా..**

అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న పరిణామాలపై తదుపరి విచారణను హైకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది. ఎమ్మెల్యేలపై పోలీసులు చర్యలు తీసుకోవద్దన్న కోర్టు ఆదేశాలతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఊరట లభించినట్లైంది.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయలేదు

హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో : తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి తాను ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పష్టం చేశారు. అసెంబ్లీ బయట తాను అనని మాటలను కూడా అన్నట్లుగా తనకు ఆపాదిస్తున్నారని అన్నారు. ఈ మేరకు తన వైఖరిని స్పష్టం చేస్తూ తాతా మధు వివరణ ఇచ్చారు.

**స్పీకర్‌పై గౌరవం ఉంది..**

స్పీకర్ వ్యవస్థ పట్ల, అలాగే వ్యక్తిగతంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పట్ల తనకు ఎంతో గౌరవం ఉందని తాతా మధు తెలిపారు. స్పీకర్ పదవిని కించపరిచే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు. తన వ్యాఖ్యలను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

**వ్యాఖ్యలు ఉపసంహరణ..**

ఒకవేళ తన వ్యాఖ్యల్లో ఏవైనా మాటలు స్పీకర్‌ను ఉద్దేశించినట్లుగా భావిస్తే.. ఆ మాటలను ఉపసంహరించుకుంటున్నట్లు తాతా మధు ప్రకటించారు. ఈ విషయంలో ఎవరినీ బాధపెట్టాలనే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు.

**వైఖరి స్పష్టం చేసేందుకే వివరణ..**

స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై తాను చేసిన వ్యాఖ్యల విషయంలో తన వైఖరిని స్పష్టం చేయడానికే ఈ వివరణ ఇస్తున్నట్లు తాతా మధు తెలిపారు. దీంతో స్పీకర్‌పై వ్యాఖ్యల వివాదానికి సంబంధించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తన వివరణను వెల్లడించారు.






# తెలంగాణ ఓటర్ల జాబితాపై ఈసీ కీలక నిర్ణయం

**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఓటర్ల జాబితాపై క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణకు ఉన్న గడువును పొడిగించింది. తొలుత సెప్టెంబర్ 16 వరకు ఉన్న గడువును అక్టోబర్ 7 వరకు పొడిగించినట్లు తెలిపింది.

**నవంబర్ 5లోగా పరిశీలన పూర్తి..**

క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ అనంతరం వాటి పరిశీలన, పరిష్కార ప్రక్రియ కొనసాగనుంది. ఈ ప్రక్రియ మొత్తాన్ని నవంబర్ 5లోగా పూర్తి చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. గడువు పొడిగింపుతో ఓటర్లకు తమ అభ్యంతరాలు, క్లెయిమ్స్ నమోదు చేసుకునేందుకు మరింత అవకాశం లభించనుంది.

**నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా..**

క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం పూర్తైన అనంతరం తెలంగాణలో తుది ఓటర్ల జాబితాను నవంబర్ 9న ప్రకటించనున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. దీంతో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో తదుపరి దశలకు స్పష్టత ఏర్పడింది.

# లండన్ ఉద్యోగాల పేరుతో రూ.15 లక్షల మోసం..
# యూట్యూబర్ రమా నందన అదుపులోకి

**విజయవాడ, ప్రజావాయిస్ బ్యూరో :** లండన్‌లో ఉద్యోగాలు, స్పాన్సర్‌షిప్‌లు ఇప్పిస్తానని చెప్పి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ తెలుగు యూట్యూబర్ రమా నందనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నందనపై లుక్‌ఔట్ నోటీసులు ఉండటంతో శంషాబాద్ విమానాశ్రయంలో ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అనంతరం శంషాబాద్ విమానాశ్రయ పోలీసులు ఆమెను ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు.

**యూకే ఉద్యోగాలు, వీసాల పేరుతో మోసం ఆరోపణలు..**

యూకేలో ఉద్యోగాలు, వీసాల పేరుతో రూ.15 లక్షలు వసూలు చేసి మోసం చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. 'నందూస్ వరల్డ్' అనే యూట్యూబ్ ఛానెల్‌తో తెలుగు రాష్ట్రాల్లో రమా నందన గుర్తింపు పొందారు. ఆమె తన భర్త జాగర్లమూడి మధుకర్, ఇద్దరు పిల్లలతో కలిసి లండన్‌లో ఉంటున్నట్లు సమాచారం. అక్కడి నుంచే యూట్యూబ్ కంటెంట్‌ను రూపొందిస్తూ ఉంటారు.

**ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో కేసు..**

నందన, ఆమె భర్త జాగర్లమూడి మధుకర్, ఆయన తండ్రి మోహన్‌రావుపై ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. యూకేలో నివాసం ఉంటున్న మామిళ్లపల్లి శివక్రాంతి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**డెస్టినీ కన్సల్టెన్సీ ఖాతాలకు రూ.15 లక్షలు..**

యూకే వీసా పొడిగింపు, ఉద్యోగం ఇప్పించడంతో పాటు సర్టిఫికెట్ ఆఫ్ స్పాన్సర్‌షిప్ ఇప్పిస్తామని నమ్మించి డబ్బులు తీసుకున్నట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. మధుకర్, నందనలకు సంబంధం ఉన్నట్లు భావిస్తున్న డెస్టినీ కన్సల్టెన్సీ బ్యాంకు ఖాతాలకు విడతల వారీగా రూ.15 లక్షలు బదిలీ చేసినట్లు తెలిపారు.

**రూ.2 లక్షలు తిరిగి ఇచ్చి.. రూ.13 లక్షలు ఇవ్వలేదని ఆరోపణ..**

డబ్బులు తీసుకున్న తర్వాత అందించిన డాక్యుమెంట్ ఫేక్ అని తేలడంతో బాధితుడు వారిని నిలదీశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పలుమార్లు ఒత్తిడి చేసిన తర్వాత కేవలం రూ.2 లక్షలు మాత్రమే తిరిగి ఇచ్చారని, మిగిలిన రూ. 13 లక్షలు ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా కేసు దర్యాప్తు కొనసాగుతుండగా.. లుక్‌ఔట్ నోటీసుల నేపథ్యంలో రమా నందనను పోలీసులు అదుపులోకి తీసుకుని ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు.

# స్పీకర్ అవమానంపై సీఎం రేవంత్ ఫైర్

**మొదటి పేజీ తరువాయి**

బీజేపీ ప్రయత్నిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. స్పీకర్ చైర్‌ను అవమానిస్తే బీజేపీ స్పందించాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు. సభ్యుల హక్కులను కాపాడే స్పీకర్‌ను అవమానించడంపై ఆ పార్టీ తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సభాపతి గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. బీఆర్ఎస్ చేసిన అపవాదులు, దుర్మార్గాలను బీజేపీ ఎందుకు కాపాడుతోందని ప్రశ్నించారు.

**తెలంగాణ ఆత్మగౌరవానికి గాయమన్న రేవంత్..**

స్పీకర్‌ను ఉద్దేశించి అత్యంత అవమానకరంగా మాట్లాడితే.. ఇంతకంటే చర్చకు ప్రాధాన్యమున్న అంశం ఇంకేముంటుందని సీఎం ప్రశ్నించారు. ఇది స్పీకర్ చైర్ గౌరవానికి సంబంధించిన విషయమని స్పష్టం చేశారు. సమాజం తలదించుకునేలా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ తెలంగాణకు చీకటి రోజని.. తెలంగాణ ఆత్మగౌరవానికే గాయమైందని వ్యాఖ్యానించారు. దళితులు, గిరిజనులకు మాత్రమే కాదు.. సభ్య సమాజానికే ఇది అవమానమని అన్నారు.

**కేసీఆర్ క్షమాపణ చెప్పాలి..**

**తాతా మధును డిస్మిస్ చేయాలి...**

తాతా మధు ఈ విధంగా మాట్లాడేందుకు కేసీఆర్‌నే పురిగొల్పి పంపించారని సీఎం ఆరోపించారు. తాతా మధు మాట్లాడిన భాషను సభ్య సమాజం సహించలేదన్నారు. స్పీకర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన తాతా మధును బీఆర్ఎస్ డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతో రాజీనామా చేయించాలని.. లేకపోతే బర్తరఫ్ చేయాలని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై కేసీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**దళితులపై కేసీఆర్ వైఖరిని ప్రశ్నించిన సీఎం..**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దళిత వ్యక్తిని ముఖ్యమంత్రిని చేస్తానని, దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తానని హామీ ఇచ్చి కేసీఆర్ మోసం చేశారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. దళిత ఉప ముఖ్యమంత్రిని బర్తరఫ్ చేసిన ఘనత కూడా కేసీఆర్‌దేనని విమర్శించారు. దళిత వ్యక్తిని ప్రతిపక్ష నేతగా కూడా చూడలేకపోతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ తన దళిత వ్యతిరేక ఆలోచనా విధానాన్ని సరిదిద్దుకోకపోతే భవిష్యత్ తరాలు ఈ సభను క్షమించవని హెచ్చరించారు. రాజకీయాలకు అతీతంగా ఈ అంశాన్ని అందరూ ఖండించాలని సూచించారు.

# స్పీకర్‌పై వ్యాఖ్యలు..
# బీఆర్ఎస్‌పై శ్రీధర్‌బాబు ఫైర్

**మొదటి పేజీ తరువాయి**

**చర్యలు తీసుకోవాల్సిందే..**

తాతా మధు చేసిన వ్యాఖ్యలతో అందరం మనస్తాపానికి గురయ్యామని శ్రీధర్‌బాబు తెలిపారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సరికాదన్నారు. స్పీకర్ చైర్‌ను అవమానించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో తాతా మధుపై చర్యలు తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు.

**బీజేపీ వైఖరి చెప్పాలన్న శ్రీధర్‌బాబు..**

స్పీకర్ వ్యవస్థ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత బీజేపీకి లేదా అని మంత్రి ప్రశ్నించారు. స్పీకర్‌ను అవమానించిన ఘటనపై బీజేపీ తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. స్పీకర్‌కు జరిగిన అవమానంపై ఆ పార్టీ మాట్లాడాలని కోరారు. సభ్యులంతా సభా సంప్రదాయాలను కాపాడాలని సూచించారు. ఈ అంశంలో బీజేపీ సహకరించాలని కోరారు.

**సభలో బీజేపీ సభ్యుల నినాదాలు..**

అయితే మంత్రి శ్రీధర్‌బాబు ప్రసంగాన్ని బీజేపీ సభ్యులు అడ్డుకోవడంతో సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. బీజేపీ సభ్యులు నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. దీంతో సభలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం కనిపించింది. బీఆర్ఎస్ నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధం..**

బీజేపీ సభ్యులు సభా కార్యక్రమాలను అడ్డుకోవడం సరికాదని శ్రీధర్‌బాబు అన్నారు. ఏ అంశంపైనైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. సభా సంప్రదాయాలను గౌరవిస్తూ చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.




# ప్రజా వాయిస్ వార్తపై స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు

- రోడ్డు శాంక్షన్ అయినా తీరని అవస్థలు.. వార్తపైస్పందించిన మంత్రి శ్రీధర్ బాబు!
- రూ.3.20 కోట్లతో 30 అడుగుల వెడల్పున రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు
- టెండర్ ప్రక్రియ పూర్తి.. వారం రోజుల్లో పనులు ప్రారంభిం చేందుకు అధికారుల ఏర్పాట్లు
- రహదారికి ఇరువైపుల రైతులు సహకరించాలని స్థానిక ప్రజాప్రతి నిధుల విజ్ఞప్తి

**ప్రజా వాయిస్, పలిమెల:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నుంచి గోదావరి వైపు వెళ్లే రహదారిపై రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఈ నెల 4వ తేదీన ప్రజా వాయిస్ దినపత్రికలో "రోడ్డు శాంక్షన్ అయినా తీరని అవస్థలు" అనే శీర్షికన ప్రచురితమైన వార్తపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. మంథని నియోజకవర్గానికి చెందిన తెలంగాణ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు అధికారులు రహదారి నిర్మాణ పనులను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు.స్థానిక ప్రజాప్రతినిధులైన పలిమెల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దందేర రాజేందర్, గ్రామ సర్పంచ్ జవ్వాజి పుష్పలతల ద్వారా రైతులకు రహదారి నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రహదారి నిర్మాణానికి రూ.3.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తికాగా, పనులు ప్రారంభించేందుకు సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.మంజూరైన రహదారి 30 అడుగుల వెడల్పుతో నిర్మాణం కానున్నందున రహదారికి ఇరువైపులా ఉన్న రైతులు సహకరించాలని ప్రజాప్రతినిధులు కోరారు. రహదారి పరిధిలో భూమిని దున్నడం, కంచెలు ఏర్పాటు చేయడం వంటి పనులు చేపట్టవద్దని సూచించారు. ప్రస్తుతం రైతులు మిర్చి మొక్కలు నాటే పనుల్లో నిమగ్నమై ఉన్న నేపథ్యంలో ముందస్తుగా ఈ ప్రకటన చేస్తున్నట్లు తెలిపారు.మరో వారం రోజుల్లో రహదారి పనులు ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారని, రహదారి నిర్మాణానికి అడ్డంకులు కలిగించే ఆక్రమణలు ఉంటే యంత్రాల సహాయంతో తొలగించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ప్రజల సౌకర్యం, రైతుల భవిష్యత్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రహదారి నిర్మాణానికి రైతు సోదరులు సహకరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దందేర రాజేందర్, పలిమెల సర్పంచ్ జవ్వాజి పుష్పలత తిరుపతి విజ్ఞప్తి చేశారు.

# పెద్దపల్లి పోలీస్ స్టేషన్‌లో అర్ధరాత్రి సీపీ ఆకస్మిక తనిఖీ

- కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి
- శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా హెచ్చరిక



**ప్రజా వాయిస్ పెద్దపల్లి** పోలీస్ స్టేషన్‌ను రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, సీసీటీఎన్ఎస్ ఆన్‌లైన్ నమోదును పరిశీలించిన ఆయన, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్ఐ నరేష్‌ను ఆదేశించారు.రాబోయే వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అధికారులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఏదైనా సంఘటన జరిగిన వెంటనే స్థలానికి చేరుకోవడం, సమన్వయంతో పనిచేయడం, తక్షణమే స్పందించడం ద్వారా క్షేత్రస్థాయిలో 90 శాతం సమస్యలను నివారించవచ్చని స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. రౌడీ షీటర్లు, హిస్టరీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని తేల్చి చెప్పారు.



# అసెంబ్లీనా.. కౌరవసభనా?

- ప్రజాస్వామ్య సభలో పోలీసు రాజ్యం
- మఠంపల్లిలో బీఆర్ ఎస్ నేతల నిరసన

**ప్రజా వాయిస్,మఠంపల్లి**, సెప్టెంబర్ 07 అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించారంటూ ఆ పార్టీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలవాల్సిన అసెంబ్లీలోనే ప్రజాప్రతినిధులపై దాడులకు పాల్పడటం ఏమిటని ప్రశ్నిస్తూ సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు.బీఆర్ఎస్ మండల నాయకులు ఇరుగు పిచ్చయ్య, మన్నెం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ.. అసెంబ్లీ సాక్షిగా తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పట్ల పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల కూడా పోలీసులు అనుచితంగా ప్రవర్తించారన్న ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి తదితరులపై కూడా పోలీసులు దాడికి పాల్పడ్డారని వారు ఆరోపించారు. ప్రజల సమస్యలను సభలో ప్రస్తావించాల్సిన ప్రజాప్రతినిధులపై పోలీసు బలాన్ని ప్రయోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మండిపడ్డారు.ప్రజాస్వామ్యానికి నిలయమైన అసెంబ్లీలోనే ప్రజాప్రతినిధులపై దాడులు జరిగితే.. అది అసెంబ్లీనా? లేక కౌరవసభనా?" అంటూ బీఆర్ఎస్ నేతలు తీవ్ర స్థాయిలో ప్రశ్నించారు.ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల గొంతును అణచివేసే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసుల దౌర్జన్యాలు కొనసాగితే మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మరింత ఉధృతంగా ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో మఠంపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు, మాజీ కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అధిష్టానానికి తెలంగాణ ప్రజల విన్నపం

- ముఖ్యమంత్రికి శాఖల భారం తగ్గించి పాలనకు ఊపిరి పోయండి!
- శాఖలు తగ్గిస్తే ముఖ్యమంత్రి బలహీనపడరు..పాలన బలపడుతుంది!
- హోం శాఖ నుంచి విద్యా శాఖ వరకు అన్నీ తానే...కీలక శాఖలపై పడుతున్న ప్రభావం
- పదవులు కాదు.. పనితీరు ముఖ్యం!
- సీఎం అన్ని శాఖలు చూసుకుంటారా? లేక శాఖలే సీఎంను చూసుకుంటున్నాయా?
- ప్రజా పాలనకు సమయం ఎక్కడ?
- హోం, మున్సిపల్, విద్యాశాఖలకు ప్రత్యేక మంత్రులు కావాలి!






**ప్రజా వాయిస్, హుజూర్ నగర్**, సెప్టెంబర్ 07తెలంగాణ ముఖ్యమంత్రి వద్ద కీలకమైన పలు శాఖలు ఉండటంపై రాజకీయ వర్గాల్లో, ప్రజల్లో చర్చ మొదలైంది. తెలంగాణలో పాలన మరింత వేగవంతంగా, సమర్థవంతంగా సాగాలంటే ముఖ్యమంత్రి వద్ద ఉన్న కీలక శాఖల బాధ్యతలను పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా హోంశాఖ, మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి, విద్యాశాఖ వంటి అత్యంత కీలకమైన శాఖలకు పూర్తి స్థాయి సమయం, ప్రత్యేక పర్యవేక్షణ అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### శాఖల భారం... పాలనపై ప్రభావం
### హోంశాఖకు 24 గంటల పర్యవేక్షణ అవసరం

శాంతిభద్రతలు, పోలీసు వ్యవస్థ, నేర నియంత్రణ వంటి అంశాలు నేరుగా ప్రజల భద్రతతో ముడిపడి ఉంటాయి. ఇలాంటి కీలక శాఖకు నిరంతర సమీక్ష, అధికారులతో సమన్వయం, క్షేత్రస్థాయి సమస్యలపై తక్షణ నిర్ణయాలు అవసరం. అదే సమయంలో రాష్ట్ర పరిపాలనలోని ఇతర బాధ్యతలు కూడా ముఖ్యమంత్రి భుజాలపైనే ఉంటే హోంశాఖకు అవసరమైనంత సమయం కేటాయించడం సాధ్యమేనా? అనే ప్రశ్న తలెత్తుతోంది.

### మున్సిపల్ శాఖ.. నగరాల సమస్యలు ఎవరు చూస్తారు?

పట్టణాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, ట్రాఫిక్ సంబంధిత మౌలిక వసతులు, పట్టణ ప్రణాళిక వంటి అనేక అంశాలు మున్సిపల్ శాఖ పరిధిలో ఉంటాయి. రాష్ట్రంలో పట్టణీకరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో ఈ శాఖకు ప్రత్యేక శ్రద్ధ అవసరం. మున్సిపల్ పరిపాలన ముఖ్యమంత్రి వద్దే కొనసాగుతున్న విషయాన్ని గత పోర్ట్‌ఫోలియో కేటాయింపుల నివేదికలు కూడా పేర్కొన్నాయి.

### విద్యాశాఖపై ప్రత్యేక దృష్టి ఎక్కడ?

ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యలు, విద్యార్థుల మౌలిక వసతులు, ఉన్నత విద్య, కొత్త విద్యా విధానాలు.. ఇలా విద్యాశాఖ పరిధి విస్తృతంగా ఉంది. ఇటీవల తెలంగాణను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యాలపై ముఖ్యమంత్రి దృష్టి సారించిన నేపథ్యంలో విద్యారంగానికి నిరంతర పర్యవేక్షణ మరింత అవసరం.

### శాఖలు తగ్గిస్తే ముఖ్యమంత్రి బలహీనపడరు.. పాలన బలపడుతుంది!

ముఖ్యమంత్రి వద్ద శాఖలు ఉండటం ప్రతిష్ఠకు సంబంధించిన విషయం కాదని, ప్రజలకు సమర్థవంతమైన పాలన అందించడం అసలు లక్ష్యమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.కీలక శాఖలకు ప్రత్యేక మంత్రులను కేటాయిస్తే ఆయా మంత్రులు పూర్తి స్థాయిలో శాఖలపై దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది. ముఖ్యమంత్రి కూడా రాష్ట్రవ్యాప్తంగా పాలనా పర్యవేక్షణ, అభివృద్ధి కార్యక్రమాలు, విధాన నిర్ణయాలపై మరింత సమయం కేటాయించగలరనే వాదన వినిపిస్తోంది.

### అధిష్టానం దృష్టి సారించాల్సిన సమయం ఇదే!

ఇటీవల తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రివర్గం, శాఖల పునర్వ్యవస్థీకరణపై చర్చలు జరిగినట్లు గతంలో వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం ఎవరికి ఏ శాఖ? అనే కోణంలో కాకుండా.. ఏ శాఖకు ఎంత సమయం, ఎంత పర్యవేక్షణ? అనే కోణంలో ఆలోచించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ముఖ్యమంత్రి అన్ని శాఖలను తన వద్దే ఉంచుకోవడం కంటే.. సమర్థులైన మంత్రులకు బాధ్యతలు అప్పగించి, వారికి జవాబుదారీతనం కల్పించడం ద్వారా పాలనకు మరింత వేగం తీసుకురావాలి.

### పదవులు కాదు, పనితీరు ముఖ్యం!

ప్రజల విన్నపం స్పష్టంగా ఉంది ముఖ్యమంత్రికి శాఖల భారం తగ్గించి పాలనకు ఊపిరి పోయండి! కాంగ్రెస్ అధిష్టానం ఈ అంశంపై దృష్టి సారించి, ఖాళీగా ఉన్న మంత్రి పదవులను భర్తీ చేయాలని, హోం, మున్సిపల్, విద్యా శాఖలకు ప్రత్యేక మంత్రులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు. పదవుల పంపిణీ కాదు, పనితీరు మెరుగుదలే లక్ష్యం కావాలనేది వారి ఆకాంక్ష.

### ప్రజా పాలనకు సమయం ఎక్కడ?

సీఎం దృష్టి మొత్తం శాఖల నిర్వహణకే పరిమితమైతే, ప్రజా పాలన లక్ష్యాలైన సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణకు సమయం ఎక్కడ దొరుకుతుందనేది ప్రశ్న. మంత్రివర్గ విస్తరణ ద్వారా పాలనా భారాన్ని పంచుకుంటే, ప్రతి శాఖపై ప్రత్యేక దృష్టి పడుతుందని, నిర్ణయ ప్రక్రియ వేగవంతమవుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

### సీఎం అన్ని శాఖలు చూసుకుంటారా? లేక శాఖలే సీఎంను చూసుకుంటున్నాయా?

ముఖ్యమంత్రి ఒకేసారి అనేక శాఖల బాధ్యతలు నిర్వహిస్తుండటంతో ప్రతి శాఖపై అవసరమైనంత సమయం కేటాయించడం సాధ్యమవుతోందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గతంలో కూడా ముఖ్యమంత్రి వద్ద ఉన్న కీలక శాఖలను ఇతర మంత్రులకు కేటాయించి పాలనా భారం తగ్గించాలనే చర్చ జరిగింది.కీలక శాఖలకు ప్రత్యేక మంత్రులు అవసరం హోంశాఖ రాష్ట్ర శాంతి భద్రతలకు సంబంధించిన అత్యంత సున్నితమైన విభాగం. అదే విధంగా మున్సిపల్ శాఖ పట్టణాల అభివృద్ధి, పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, ప్రజా సమస్యలతో నేరుగా ముడిపడి ఉంది. విద్యాశాఖ భవిష్యత్ తరాలపై ప్రభావం చూపే కీలక రంగం.ఇలాంటి శాఖలకు ప్రతిరోజూ సమీక్షలు, అధికారులతో సమన్వయం, క్షేత్రస్థాయి సమస్యలపై నిర్ణయాలు అవసరం. ప్రభుత్వం విద్యారంగంపై పలు లక్ష్యాలను ప్రకటిస్తున్న నేపథ్యంలో ఈ శాఖపై ప్రత్యేక దృష్టి అవసరం మరింత పెరుగుతోంది.అధిష్టానం దృష్టి సారించాలి. ముఖ్యమంత్రి అన్ని శాఖలను చూసుకోవడం కంటే...ప్రతి శాఖకు ప్రత్యేకంగా బాధ్యత వహించే మంత్రులను నియమిస్తే పాలన మరింత వేగవంతం అవుతుంది అనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అందువల్ల కాంగ్రెస్ అధిష్టానం ఈ అంశంపై దృష్టి సారించి, ముఖ్యమంత్రి వద్ద ఉన్న అదనపు శాఖల బాధ్యతలను సమర్థులైన మంత్రులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.ముఖ్యమంత్రి పదవి ఒక్కటే కాదు.. రాష్ట్రంలోని ప్రతి శాఖకు సమయం, పర్యవేక్షణ, జవాబుదారీతనం అవసరం. శాఖల భారం తగ్గిస్తే ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా కీలకమైన విధాన నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాలపై మరింత సమర్థవంతంగా దృష్టి సారించే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

- మల్కాపూర్ లో వైభవంగా గజస్తంభ ప్రతిష్ఠాపన.. గ్రామ పురవీధుల్లో ఘనంగా అమ్మవారి ఊరేగింపు
- వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ప్రతిష్ఠాపన
- భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం



**పెద్ద శంకరంపేట ప్రజా వాయిస్** :మల్కాపూర్ గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన, గజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు సోమవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా ముందుగా అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి గ్రామ పురవీధుల్లో భక్తుల సమక్షంలో ఘనంగా ఊరేగించారు.అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ఆలయ ప్రాంగణానికి తీసుకువచ్చి బ్రాహ్మణుల వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అదే సమయంలో ఆలయ గజస్తంభానికి కూడా ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పూర్తి చేశారు.భక్తులతో సందడిగా ఆలయ ప్రాంగణంపెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మహిళలు, యువత, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.విగ్రహ ప్రతిష్ఠాపన, గజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు విజయవంతంగా పూర్తవడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలందరికీ పెద్దమ్మ తల్లి ఆశీస్సులు ఉండాలని ఈ సందర్భంగా గ్రామ పెద్దలు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు, భక్తులు, మహిళలు, యువత, గ్రామస్థులు తదితరులు పాల్గొని పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

- ప్రమాదంలో వ్యక్తి మృతి



**ప్రజా వాయిస్/అడ్డగూడూరు:** ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు వెనుక నుండి ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల పరిధిలోని కంచనపల్లి స్టేజి వద్ద వలిగొండ–తొర్రూరు ప్రధాన రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చౌల్లరామారం గ్రామానికి చెందిన ఊర సోమన్న, సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని అనంతారంకు చెందిన పెస్తం జంపన్న మోత్కూరు మండలం పాటిమట్ల నుండి చౌల్లరామారంకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా యాదగిరిగుట్ట డిపో నుండి వస్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుండి ఢీ కొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న సోమన్న (30), అక్కడికక్కడే మృతి చెందగా, వాహనం నడుపుతున్న పెస్తం జంపన్నకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని వెంటనే స్థానికులు 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఒక కూతురు ఉన్నారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట్ రెడ్డి విలేకరులకు తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# కేటీఆర్ పిలుపు బేఖాతర్

- మూడు చింతలపల్లిలో బీఆర్ ఎస్ కు కార్యకర్తల కరువు!
- నాయకుల కోసం కార్యకర్తల ఎదురుచూపులు
- బీఆర్ ఎస్ నిరసనకు స్పందన కరువు!
- పదేళ్లు అధికారంలో.. ఇప్పుడు కార్యకర్తల కరువు!
- మూడు చింతలపల్లిలో గులాబీ గ్రాఫ్ డౌన్ ?
- అధ్యక్షులు నిర్లక్ష్యం తో కనుమరుగు అవుతున్న కార్యకర్తలు
- తూతూ మంత్రంగా బీఆర్ ఎస్ నిరసన
- మహిళా కౌన్సిలర్లు, వైస్ చైర్ పర్సన్ ఎక్కడ...?
- మూడు చింతలపల్లిలో బీఆర్ ఎస్ కు బలహీనత సంకేతాలా...? ఉనికి కోల్పోతుందా?

శామీర్ పేట / ప్రజా వాయిస్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన నిరసన కార్యక్రమాల పిలుపునకు ఆదివారం మూడు చింతలపల్లి మునిసిపల్ లో వీరారెడ్డి ప్రధాన చౌరస్తాలో తూతు మంత్రంగా నిరసన వ్యక్తం చేసి తాసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.



### కార్యకర్తల్లో తగ్గిన జోష్...

మూడు చింతలపల్లి లో ఆశించిన స్థాయిలో కార్యకర్తల స్పందన కనిపించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ అధిష్టానం పిలుపు నిచ్చినా స్థానికంగా నిరసన కార్యక్రమాలు నామమాత్రంగా సాగుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది.

### నిర్లక్ష్యం వహిస్తున్న పార్టీ ముఖ్య పెద్దలు




పార్టీ కార్యక్రమాలకు నాయకత్వం వహించాల్సిన ముఖ్య నాయకులు అందుబాటులో లేకపోవడంతో కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మహిళా కౌన్సిలర్లు, వైస్ చైర్‌పర్సన్ వంటి ప్రజాప్రతినిధులు పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమాలకు దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. దశాబ్ద కాలం పాటు అధికారంలో ఉన్న సమయంలో పార్టీ కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యేవారని, ప్రస్తుతం మాత్రం అదే స్థాయిలో కార్యకర్తల సమీకరణ కనిపించడం లేదని స్థానిక రాజకీయ పరిశీలకులు అంటున్నారు. తాజాగా చేపట్టిన నిరసన కార్యక్రమం కూడా 'తూతూ మంత్రంగా' సాగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.కేటీఆర్ పార్టీ శ్రేణులను క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని పిలుపునిస్తున్న వేళ.. మూడు చింతలపల్లిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోందన్న చర్చ సాగుతోంది. స్థానిక నాయకత్వం కార్యకర్తలను సమీకరించడంలో విఫలమవుతోందా? లేక బీఆర్ఎస్ క్యాడర్‌లో ఉత్సాహం తగ్గిందా? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి.మూడు చింతలపల్లిలో బీఆర్ఎస్ బలం క్రమంగా తగ్గుతోందా? పార్టీ ఉనికిని కాపాడుకునేందుకు స్థానిక నాయకత్వం ఎలాంటి కార్యాచరణ చేపడుతుంది? అనేది వేచి చూడాల్సిందే.



# కుక్కలు, కోతులతో గాంధీనగర్ ప్రజలకు నరకయాతన

- కుక్క కాటుతో బాలుడికి తీవ్ర గాయాలు
- పట్టించుకోని అధికారులు
- వీధుల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలు, కోతులతో భయాందోళనలో ప్రజలు.

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మండలంలోని గాంధీనగర్ గ్రామంలో కుక్కలు, కోతుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా గ్రామానికి చెందిన చిలగాని శ్రీహాన్ అనే బాలుడిని కుక్క కరిచి తీవ్ర గాయాలు కాగా, కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు.గాంధీనగర్‌లో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తూ చిన్నారులు, వృద్ధులు, మహిళలపై దాడులకు పాల్పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కోతులు ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడంతో పాటు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని చెబుతున్నారు.

### బయటకు రావాలంటే భయం :

పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, పనుల నిమిత్తం బయటకు వెళ్లే మహిళలు, వృద్ధులు వీధుల్లో కుక్కల సంచారంతో భయాందోళనకు గురవుతున్నారు. కుక్కల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నా సంబంధిత మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కోతుల సమస్య కూడా తీవ్రంగా మారడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు గాంధీనగర్‌లో పర్యటించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవడంతో పాటు కోతుల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. పత్రికలలో ఎన్ని కథనాలు ప్రచురించిన సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తన్నట్లు వ్యవహరిస్తున్నారని, ఇలాంటి మరిన్ని సంఘటనలు జరగకముందే, జిల్లా కలెక్టర్ స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# అంబేద్కర్ చరిత్రను వక్రీకరిస్తే ఊరుకోం!

- 'కల్పిత నాయకుడు' పుస్తకంపై ఎస్సీ సంక్షేమ సంఘం ఫైర్
- హమారా ప్రసాద్ పై చర్యలు తీసుకోవాలి
- ఎస్పీకి ఫిర్యాదు చేస్తాం
- రాజ్యాంగ నిర్మాతను కించపరిచే ప్రచారాన్ని అడ్డుకోవాలని డిమాండ్



**ప్రజా వాయిస్,కొమరం భీం ఆసిఫాబాద్:**భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చరిత్ర, వ్యక్తిత్వం, ఆలోచనా విధానం, రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పాత్రను కించపరిచేలా సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేయడాన్ని ఎస్సీ సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండించింది.అంబేద్కర్ ను 'కల్పిత నాయకుడు'గా పేర్కొంటూ పుస్తకాన్ని ప్రచురించి త్వరలో ఆవిష్కరించనున్నట్లు ప్రచారం చేస్తున్న హమారా ప్రసాద్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంఘం డిమాండ్ చేసింది. ఈ వ్యవహారంపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసి, సమగ్ర విచారణ జరిపించాలని కోరనున్నట్లు ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జాడీ దిలీప్ కుమార్ తెలిపారు.కాగజ్ నగర్ లోని అంబేద్కర్ భవన్ లో సోమవారం ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సంఘం జాతీయ అధ్యక్షుడు తీగల అశోక్ కుమార్ పిలుపు మేరకు నిర్వహించిన ఈ సమావేశంలో అంబేద్కర్ పై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై ప్రధానంగా చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జాడీ దిలీప్ కుమార్ మాట్లాడుతూ.. దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడిపై నిర్ధారణ లేని సమాచారం, అసత్య ప్రచారం చేయడం బాధాకరమన్నారు. చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

### 'కల్పిత నాయకుడు' పేరుతో ప్రచారం

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ను 'కల్పిత నాయకుడు'గా పేర్కొంటూ పుస్తకాన్ని రూపొందించి, త్వరలో విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని దిలీప్ కుమార్ తెలిపారు. పుస్తకంలో పేర్కొన్న అంశాలు వాస్తవ ఆధారాలతో ఉన్నాయా? లేదా? అనే విషయాన్ని అధికారులు పరిశీలించాలని కోరారు. అంబేద్కర్ చరిత్రను వక్రీకరించేలా, ఆయన ప్రతిష్టకు భంగం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### సమాజంలో అశాంతికి దారితీసే అవకాశం

అంబేద్కర్ దేశంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలపై విశేష ప్రభావం చూపిన నాయకుడని వారు పేర్కొన్నారు. ఆయన జీవిత చరిత్ర, ఆలోచనా విధానంపై తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో అపోహలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. సోషల్ మీడియా ద్వారా నిర్ధారణ లేని సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేయడం వల్ల వివిధ వర్గాల మధ్య అపార్థాలు, విద్వేషాలు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రచారం వెనుక ఉద్దేశం ఏమిటి? పుస్తకంలో ఏ అంశాలను పొందుపరిచారు? వాటికి ఆధారాలు ఉన్నాయా? అనే కోణాల్లో సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

### ఎస్పీకి ఫిర్యాదు చేస్తాం

ఈ అంశంపై త్వరలో జిల్లా ఎస్పీని కలిసి పూర్తి వివరాలతో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. చట్టానికి విరుద్ధంగా వ్యవహరించినట్లు విచారణలో తేలితే సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు చెప్పారు. అంబేద్కర్ గౌరవానికి భంగం కలిగించే ఎలాంటి ప్రచారాన్నైనా చట్టపరమైన మార్గాల్లో ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

### రాజ్యాంగ విలువల పరిరక్షణకు పోరాటం

ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాందేకార్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం, సమానత్వ స్ఫూర్తిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అంబేద్కర్ గౌరవాన్ని కాపాడేందుకు, రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజల్లో మరింత బలపరిచేందుకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

### సంఘం నాయకుల హెచ్చరిక

అంబేద్కర్ చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని నాయకులు కోరారు. వాస్తవాలను పరిశీలించకుండా ప్రచారం చేసే సమాచారాన్ని నమ్మవద్దని కోరారు. అంబేద్కర్ గౌరవం, రాజ్యాంగ విలువలకు భంగం కలిగించే అంశాలపై చట్టపరమైన చర్యలకు వెనుకాడబోమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాందేకార్ రాజేంద్రప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు చప్పిడి సురేష్, మల్లెపల్లి రాజనర్సయ్య, నాయకులు చంద్రశేఖర్, సదానందం, లక్ష్మణ్ గౌడ్, రమాదేవి, ప్రమీల, సుజాత, సులోచన తదితరులు పాల్గొన్నారు.



# చలో ఐటీడీఏ

- ఏటూరునాగారం.. పలిమెల నుంచి భారీగా ఆదివాసీల తరలింపు
- తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసీ మార్చ కు పలిమెల నుంచి భారీ స్పందన
- ఆదివాసీ హక్కుల కోసం ఐటీడీఏ ఏటూరునాగారం వైపు పయనం
- కార్యక్రమంలో పాల్గొన్న పలిమెల మండలానికి చెందిన ఆదివాసీ నాయకులు, విద్యార్థులు

**ప్రజా వాయిస్, పలిమెల:** ఆదివాసీ హక్కుల సాధన కోసం ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) ఆధ్వర్యంలో చేపట్టిన "చలో ఐటీడీఏ ఏటూరునాగారం" ఆదివాసీ మార్చ్ కార్యక్రమానికి పలిమెల మండలం నుంచి ఆదివాసీలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుడిమేత సమ్మయ్య దొర, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు మడే సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఆదివాసీల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఆదివాసీ మార్చ్‌లో పాల్గొనేందుకు పలిమెల మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఆదివాసీలు పెద్ద సంఖ్యలో బయలుదేరారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలిమెల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మట్టి కిషోర్, పెద్ది శేఖర్, పెద్ది రాజు, మట్టి రమేష్, మట్టి శ్రీకాంత్, బూరుగుగూడెం గ్రామ అధ్యక్షులు పూణెం గణేష్, మాజీ ఎంపీపీ కురుసం బుచ్చక్క, జిల్లా కార్యదర్శి కోట అశోక్, కాళేశ్వరం డైరెక్టర్ నర్సయ్య, ఇంద్రసేన తదితరులు పాల్గొన్నారు.

# ధరల మంటలో సామాన్యుడి బతుకు!

- ఉల్లిగడ్డ నుంచి వంటనూనె వరకు.. పెరుగుతున్న ధరలతో కుదేలవుతున్న కుటుంబ బడ్జెట్
- ఆదాయం పెరగడం లేదు..
- ఖర్చులు మాత్రం రోజురోజుకూ పైపైకి




**ప్రజా వాయిస్, హుజూర్‌నగర్,** సెప్టెంబర్ 07నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. కూరగాయలు, వంట సరుకులు, బియ్యం, వంటనూనెతో పాటు పెట్రోల్ వంటి వాటి ధరలు పెరుగుతుండటంతో మధ్యతరగతి, పేద కుటుంబాలపై ఆర్థిక భారం రోజురోజుకూ పెరుగుతోంది. మార్కెట్‌లో ధరల పరిస్థితిని చూస్తుంటే సంపాదన కంటే ఖర్చులే ఎక్కువగా మారాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం ఉల్లిగడ్డల ధర కిలోకు రూ.60 వరకు, పంచదార రూ.70 వరకు, వంటనూనె లీటర్ రూ.195 వరకు, పెట్రోల్ లీటర్ రూ.117 వరకు పలుకుతున్నట్లు ధరల పట్టికలో పేర్కొన్నారు. బియ్యం, కూరగాయలు తదితర నిత్యావసరాల ధరలు కూడా సామాన్యులకు భారంగా మారుతున్నాయి. ప్రతిరోజూ మార్కెట్‌కు వెళ్లే వినియోగదారులు ఏ వస్తువు కొనాలన్నా ధరలు షాక్‌కు గురిచేస్తున్నాయని చెబుతున్నారు.

### కుటుంబ బడ్జెట్ తారుమారు

ధరల పెరుగుదల ప్రభావం నేరుగా ఇంటి బడ్జెట్‌పై పడుతోంది. గతంలో నెలకు ఒకసారి పెద్ద మొత్తంలో సరుకులు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం ధరలు పెరగడంతో అదే మొత్తంలో సరుకులు కొనలేని పరిస్థితి ఏర్పడిందని పలువురు చెబుతున్నారు. పిల్లల చదువులు, వైద్యం, ఇంటి అద్దె, విద్యుత్ బిల్లులు, ప్రయాణ ఖర్చులు ఇలా ఇప్పటికే అనేక రకాల భారాలు ఉండగా, నిత్యావసర ధరల పెరుగుదల మరింత ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పెట్రోల్ ధరల ప్రభావం అన్ని రంగాలపైపెట్రోల్ ధరలు పెరగడం కేవలం వాహనదారులపైనే కాకుండా ఇతర రంగాలపైనా ప్రభావం చూపుతోంది. రవాణా ఖర్చులు పెరగడంతో సరుకుల ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని వినియోగదారులు అంటున్నారు. దీంతో ఒక వస్తువు ధర పెరిగితే దాని ప్రభావం మరో వస్తువుపై పడుతూ ధరల పెరుగుదల ఒక దానికొకటి అనుసంధానమవుతోందని పేర్కొంటున్నారు.

### ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

నిత్యావసర వస్తువుల ధరలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచే వ్యాపారులపై అధికారులు నిఘా పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మార్కెట్‌లో ధరల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవడంతో పాటు సామాన్యులకు అందుబాటులో ఉండేలా నిత్యావసర సరుకుల సరఫరాను పెంచాలని కోరుతున్నారు.జీతాలు, ఆదాయాలు పెరగకపోయినా నిత్యావసరాల ధరలు మాత్రం పెరుగుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే పేద, మధ్యతరగతి కుటుంబాలు నెలవారీ ఖర్చులను ఎలా భరించాలి? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ధరల నియంత్రణకు చర్యలు చేపట్టి సామాన్యుడిపై పడుతున్న భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు.

# సిరికొండలో మెడికల్ క్యాంపు

- 116 మందికి వైద్య పరీక్షలు


**ప్రజా వాయిస్, కథలాపూర్:** మండలంలోని సిరికొండ గ్రామంలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ ముదామ్ రవి అధ్యక్షతన జరిగిన ఈ శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ పి. సింధూజ రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మొత్తం 116 మంది శిబిరానికి రాగా, 27 మందికి బీపీ, 18 మందికి షుగర్ పరీక్షలు చేసి తగిన జాగ్రత్తలు సూచించారు. ముగ్గురు జ్వర బాధితులను గుర్తించి ఉన్నత చికిత్సకు పంపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో దోమలు ప్రబలకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిట్కూరు మల్లయ్య, వార్డు సభ్యులు, సిహెచ్ఓ టి. వేణుగోపాల్, ఎంఎల్‌హెచ్‌పీ ఇ. మమత, ఏఎన్ఎం పి. మంజుల, ఆశా కార్యకర్తలు అన్నపూర్ణ, రత్న తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇల్లు.. ఇంటింటా సౌభాగ్యం

- కేశవరం గ్రామంలో ఘనంగా ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం
- మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం

**శామీర్ పేట్ / ప్రజా వాయిస్ :** రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా కేశవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటికి గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఎంసీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్ హాజరయ్యారు. కేశవరం గ్రామానికి చెందిన బొమ్మలపల్లి నవనీతకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటిని బొమ్మలపల్లి నర్సింలు, దోసకాయల వెంకటేష్, కౌన్సిలర్ బొమ్మలపల్లి మల్లేష్ యాదవ్ కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... తెలంగాణలో నిరుపేద కుటుంబాలందరికీ సొంతింటి సౌకర్యం కల్పించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. పేదల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ రాష్ట్రాన్ని పూరిగుడిసెలు లేని తెలంగాణగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోందని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, భూమేష్, మున్సిపల్ మాజీ బీసీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్, సంతోష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కొల్తూరు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





# వికారాబాద్ పట్టణంలో మ్యాజిక్ వర్షం

- ఒకవైపు ఎండ, మరోవైపు వాన
- ఇది చాలా అరుదుగా జరిగే ప్రకృతి అద్భుతం
- ఎండా వాన కురిస్తే ఎక్కడో నక్క పెళ్లి జరుగుతుందని సామెతలు గుర్తు చేసుకున్న స్థానికులు

**ప్రజావాయిస్/వికారాబాద్:**వికారాబాద్ పట్టణంలో సోమవారం సాయంత్రం అరుదైన వాతావరణ దృశ్యం ఆవిష్కృతమైంది. ఒకవైపు భానుడి ఎండ చుర్రుమనిపిస్తుండగానే, మరోవైపు జల్లుమంటూ వాన కురవడంతో పట్టణవాసులు ఆశ్చర్యానికి గురయ్యారు. దీన్నే స్థానికులు ముద్దుగా "మ్యాజిక్ వర్షం" లేదా "ఎండా వాన" అంటున్నారు.మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. ఒక్కసారిగా పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో, ముఖ్యంగా ప్రధాన రహదారి,రాజీవ్ గృహకల్ప, ఆలంపల్లి,కోర్టు ఏరియా పరిసరాల్లో చిరుజల్లులు కురిశాయి. అదే సమయంలో సూర్యుడు ప్రకాశవంతంగా ఉండటంతో ఎండా వానను ప్రజలు ఆసక్తిగా చూశారు. కొందరు ఈ అద్భుతాన్ని తమ సెల్ ఫోన్లలో బంధించారు.ఎండలో వాన కురవడాన్ని వాతావరణ శాస్త్రంలో 'సన్ షవర్' అంటారు. దూరంగా ఉన్న మేఘాల నుండి గాలికి కొట్టుకువచ్చిన వర్షపు నీరు, మేఘాలు లేని ప్రాంతంలో ఎండ ఉన్నా కురుస్తుంది. ఇది చాలా అరుదుగా జరిగే ప్రకృతి అద్భుతం.ఎండా వాన కురిస్తే ఎక్కడో నక్క పెళ్లి జరుగుతుందని పెద్దలు చెబుతుంటారని, ఆ సామెతను గుర్తు చేసుకుంటూ చిన్నారులు, పెద్దలు సంబరపడ్డారు. సుమారు 20 నిమిషాల పాటు కురిసిన ఈ మ్యాజిక్ వర్షం తర్వాత వాతావరణం చల్లబడి ఆహ్లాదకరంగా మారింది.

# వాగులను తవ్వేస్తున్నారు!!

- కిన్నెరసాని వాగు, బుడ్డగూడెం ప్రాంతం నుండి ఇసుక తవ్వకాలు
- ట్రాక్టర్లతో రాత్రి పూట యదేచ్ఛగా ఇసుక రవాణా
- పట్టించుకోని, రెవిన్యూ, పోలీస్ శాఖ
- ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన ఫలితం శూన్యం



**ప్రజా వాయిస్ బూర్గంపాడు**
బూర్గంపాడు మండల పరిధిలోని బుడ్డగూడెం కిన్నెరసాని వాగుల నుండి ప్రతి రోజు రాత్రులు అక్రమ ఇసుక రవాణా జోరుగా కొన సాగుతుంది. న ది గర్భం లోని నేరుగా యంత్రాలను దించి సుమారు 20నుండి 30 ట్రాక్టర్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా ఏదేచ్ఛగా అక్రమ ఇసుక రవాణా కొనసాగుతుంది.అయితే మండల కేంద్రం లో ఉన్న కిన్నెరసాని వాగు నుండి అక్రమ ఇసుక రవాణా పై చర్యలు చేపట్టాలని సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగింది.కానీ ఈ ఫిర్యాదులపై స్థానిక తహసీల్దార్, సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పై స్థానిక ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు,బుడ్డగూడెం ప్రాంతం నుండి కూడా జోరుగా అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నా స్థానిక అధికారులు అక్రమ ఇసుక రవాణాను కట్టడి చేయకపోగా,వారి పై చర్యలు తీసుకోకపోవడం తో మండల వ్యాప్తంగా చర్చనీ అంశంగా మారింది.ఇదిలా ఉండగా, కొన్ని ట్రాక్టర్లను మైనర్లు, అనుభవం లేని యువకులు నడుపుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. మరి కిన్నెరసాని మరియు బుడ్డగూడెం ప్రాంతంలో జరిగే, అక్రమ ఇసుక రవాణా పై మండల అధికారులు చర్యలు చేపడతారా..? లేదా అనేది వేచి చూడవలసిన ఉంది.

# తోల్కట్ట సర్కారు భూముల్లో దొంగలు పడ్డారు..!

- 30 ఎకరాలకుపైగా సర్కారు భూమిలో మెగా యంత్రాల జోరు
- యంగ్ ఇండియా స్కూల్ సాకుతో చకచక సాగుతున్న పనులు
- పాఠశాల కోసమే ప్రపోజల్ పంపించాం
- ఇంకా అనుమతులు రాలే వంటున్న రెవెన్యూ అధికారి
- ఆలస్యంగా మేల్కొన్న పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్
- డిప్యూటీ తహసీల్దార్ కు పిర్యాదు
- పాఠశాల పేరుతో తెరవెనుక చీకటి ఒప్పందం జరిగుండొచ్చు అంటూ గ్రామంలో గుసగుసలు
- దొంగలు ఎవరో..? దందా ఏంటో నిజానిజాల నిగ్గు తెల్చాలని గ్రామస్తుల డిమాండ్




**మొయినాబాద్ (ప్రజావాయిస్ ):**సర్కారు భూమి అంటే ఎవడబ్బ సొత్తు కాదు.. అది ప్రజల ఆస్తి. అలాంటి భూమిలో 30 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో భారీ మెగా కంపెనీ యంత్రాలు దిగి చకచకా చదును చేస్తున్నాయి.ఇది ఎవరి అనుమతితో జరుగుతోంది? అన్న ప్రశ్నకు మాత్రం స్పష్టమైన సమాధానం లేకపోవడం తోల్కట్టలో ఇప్పుడు గరం గరం చర్చకు దారితీసింది.రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం తోల్కట్ట గ్రామంలోని సర్వే నంబర్లు 92, 103, 104 పరిధిలో 30 ఎకరాలకు పైగా భూమిలో భారీ యంత్రాలతో చదును పనులు జరుగుతున్నాయంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గ్రామస్తుల ఆరోపణల ప్రకారం .. ఎలాంటి స్పష్టమైన అనుమతులు లేకుండానే మెగా యంత్రాలతో పనులు చకచకా సాగుతున్నాయి. జేసీబీలు, ఇతర భారీ వాహనాలు తిరుగుతుండటంతో ఇంత పెద్ద ఎత్తున పనులు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.ఈ భూమిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం పనులు జరుగుతున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. అయితే స్కూల్ నిర్మాణానికి సంబంధించిన అనుమతులు ఇంకా రాలేదని ,ప్రపోసల్ పంపించామని రెవెన్యూ అధికారి ప్రజావాయిస్ ప్రతినిధితో చెప్పారు.ఈ పనులు దాదాపు ఏడాది కాలంగా ఎట్లాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్నాయి. ఇంతకాలం పనులు జరుగుతున్నా గ్రామ పంచాయతీ యంత్రాంగం సైతం నిశ్శబ్దంగా ఉండటం ఆశ్చర్యం.సోమవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ స్పందించి ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా జరుగుతున్న పనులను నిలిపివేయాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పేరుతో ప్రభుత్వ భూమిలో పనులు జరుగుతున్న నేపథ్యంలో.. తెరవెనుక ఏదైనా చీకటి ఒప్పందం జరిగిందా? అనే గుసగుసలు గ్రామంలో వినిపిస్తున్నాయి.నిజానిజాలు తేలాలంటే భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు, భూమి కేటాయింపు వివరాలు, స్కూల్‌కు సంబంధించిన ప్రపోజల్, అనుమతులు, పనులకు సంబంధించిన ఉత్తర్వులను అధికారులు పరిశీలించి దొంగలు ఎవరో.. తెరవెనుక దందా ఏంటో నిగ్గు తెల్చాలని శివశంకర్ గౌడ్ డిమాండ్ చేస్తున్నారు.



# ఆశా వర్కర్లను వేధిస్తున్న ఏఎన్ఎంపై చర్యలు తీసుకోవాలి

- ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన ఆశా వర్కర్స్ యూనియన్

**ప్రజా వాయిస్.. వనపర్తి** పానగల్ మండలంలోని షాగాపూర్ సబ్‌సెంటర్‌కు చెందిన ఏఎన్ఎం సుమిత్ర ఆశా వర్కర్లను విధుల నిర్వహణలో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులకు వినతిపత్రం అందజేసి, సమగ్ర విచారణ జరిపి తప్పు తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు రేణుక, మహేశ్వరి మాట్లాడుతూ మాధవరావుపల్లి, షాగాపూర్, కదిరేపాడు, షాగాపూర్ తాండ, దావఖానపల్లి, ఆకునపల్లి సగటు తాండ తదితర గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించేందుకు ఆశా వర్కర్లు బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.అయితే ఏఎన్ఎం సుమిత్ర తమపై అనవసర ఒత్తిడి తీసుకురావడంతో పాటు అవమానకరంగా మాట్లాడటం, భయపెట్టడం, తమ మాట వినేలా ఒత్తిడి చేయడం జరుగుతోందని ఆరోపించారు. వ్యక్తిగత, కుటుంబ విషయాల్లో జోక్యం చేసుకుంటూ మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు.ప్రతి నెల ఏదో ఒక గ్రామానికి చెందిన ఆశా వర్కర్ల జీతాలు నిలిపివేస్తామని, తదుపరి నెల జీతం కూడా ఆపుతామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల మాధవరావుపల్లి గ్రామానికి చెందిన ఓ ఆశా వర్కర్ జీతం నిలిపివేయడంతో పాటు, ఇతర ఆశా వర్కర్లను కూడా జీతాలు ఆపుతానంటూ బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.అదేవిధంగా ప్రజలకు అవసరమైన ఇంజక్షన్లు, మందులు తదితర ఆరోగ్య సేవలు సకాలంలో అందుబాటులో లేకపోవడంతో గ్రామీణ ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ పరిణామాల వల్ల ఆశా వర్కర్లు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, దాని ప్రభావం ప్రజలకు అందించాల్సిన ఆరోగ్య సేవలపై పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.కావున సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని, ఆరోపణలు నిజమని తేలితే ఏఎన్ఎం సుమిత్రపై తగిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎలాంటి భయాందోళనలు లేకుండా ఆశా వర్కర్లు విధులు నిర్వహించేలా అనుకూల వాతావరణం కల్పించాలని, కారణం లేకుండా జీతాలు నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో యాదమ్మ, లక్ష్మీ, రేణుక, సరస్వతి, లలిత, భాగ్యమ్మ, సరితతో పాటు మాధవరావుపల్లి, షాగాపూర్, కదిరేపాడు, షాగాపూర్ తాండ, దావఖానపల్లి గ్రామాలకు చెందిన ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# కోరుట్లలో మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడలు ప్రారంభం



**ప్రజా వాయిస్, కోరుట్ల:** పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం మండల స్థాయి పాఠశాలల క్రీడాసమాఖ్య క్రీడలను మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత–గంగాధర్ ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించగా, తదుపరి రోజుల్లో ఖోఖో,వాలీబాల్ పోటీలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ గంగుల నరేశం, మండల కన్వీనర్ బి.శ్రీనివాస్, ట్రాస్మా ప్రెసిడెంట్ భారీ, కౌన్సిలర్ వాసిం, వివిధ పాఠశాలల వ్యాయామఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎస్జీఎఫ్ పోటీల్లో ఐపీఎస్ విద్యార్థుల సత్తా

- కబడ్డీ, వాలీబాల్ లో ప్రథమ బహుమతులు
- అథ్లెటిక్స్ లోనూ ప్రతిభ

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :** మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీల్లో ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. అండర్–17 బాలికల కబడ్డీ, బాలుర వాలీబాల్‌లో ప్రథమ స్థానాలు సాధించారు. ఖోఖో, బాలికల వాలీబాల్‌లో ద్వితీయ బహుమతులు దక్కించుకున్నారు. అథ్లెటిక్స్ షాట్‌పుట్ లో అండర్–14, అండర్–17 బాలికలు ప్రథమ స్థానాలు, అండర్–14 బాలుర విభాగంలో తృతీయ స్థానం సాధించారు.విజేత విద్యార్థులను పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ అభినందించారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించేందుకు క్రమశిక్షణతో సాధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శివ, వైస్ ప్రిన్సిపల్ సునీత, వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, సతీష్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



# స్పీకర్‌ను అవమానిస్తే ఊరుకునేది లేదు!

- బీఆర్ ఎస్ నేతల వైఖరిపై కాంగ్రెస్ ఫైర్
- నేడు మిర్యాలగూడలో భారీ నిరసన ర్యాలీ



**ప్రజా వాయిస్.. మిర్యాలగూడ** తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం ముదిరింది. శాసన సభ స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని పక్కనపెట్టి బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గవర్నర్ ప్రసంగం కొనసాగుతున్న సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీ బయట నిరసనకు దిగడం, పోలీసులతో ఘర్షణకు దిగిన ఘటనతో పాటు స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసినట్లు పేర్కొన్న అసభ్యకర వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి అవమానమని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు.మిర్యాలగూడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. స్పీకర్ వ్యక్తిపై దాడి కాదు.. రాజ్యాంగబద్ధమైన పదవిపైనే దాడి చేసినట్లుగా ఈ వ్యాఖ్యలను చూస్తున్నామని అన్నారు.దళిత నాయకుడు గడ్డం ప్రసాద్ శాసనసభ స్పీకర్‌గా ఉన్న నేపథ్యంలో ఆయనను కించపరిచేలా మాట్లాడటం వెనుక ఉన్న రాజకీయ ఉద్దేశాన్ని బీఆర్ఎస్ నాయకత్వం ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. పదవి ఏ పార్టీకి చెందిన వ్యక్తిదైనా.. ఆ పదవికి గౌరవం ఇవ్వడం ప్రజాస్వామ్య సంప్రదాయం అని స్పష్టం చేశారు.బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలు, వ్యవహారశైలిని సమర్థిస్తున్నారా? ఖండిస్తున్నారా? అనే విషయంపై ఆ పార్టీ నాయకత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఒకవైపు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతూనే మరోవైపు రాజ్యాంగ పదవుల గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.“దళితుల ఆత్మగౌరవాన్ని అవమానిస్తే చూస్తూ ఊరుకునేది లేదు.. రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడేందుకు ప్రజల తరపున నిలబడతాం” అంటూ కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు.ఈ ఘటనకు నిరసనగా మంగళవారం రోజున మిర్యాలగూడ పట్టణంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీకి అన్ని వర్గాల ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున హాజరై సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు.రాజకీయ విభేదాలు ఉండొచ్చు.. కానీ రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడాల్సిందే. వ్యక్తిగత విమర్శలకు, అసభ్యకర వ్యాఖ్యలకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.ఇకనైనా బీఆర్ఎస్ నాయకత్వం తన నేతల వైఖరిపై స్పష్టత ఇవ్వాలని, ప్రజాస్వామ్య విలువలకు, దళితుల ఆత్మగౌరవానికి, శాసనసభ స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.



# ప్రజావాణికి ప్రజలు కరువు.. అధికారులే దిక్కు!

- అవగాహన లోపమా? నమ్మకం లేకపోవడమా?
- మోమిన్ పేట్ లో ఒక్క ఫిర్యాదు కూడా రాని ప్రజావాణి

**ప్రజావాయిస్/మోమిన్‌పేట్:**ప్రజల సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటికి పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల స్పందన కరువైంది. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు హాజరైనప్పటికీ, ఒక్క ఫిర్యాదు కూడా అందకపోవడం చర్చనీయాంశంగా మారింది.ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు ఎందుకు హాజరు కాలేదన్న ప్రశ్నలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. ప్రజావాణి కార్యక్రమంపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవడమా? లేక తమ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం అవుతుందన్న నమ్మకం సన్నగిల్లిందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.గ్రామీణ ప్రాంతాల్లో అనేక సమస్యలు నెలకొని ఉన్నప్పటికీ వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజలు ముందుకు రాకపోవడం ఆలోచించాల్సిన విషయమని పలువురు పేర్కొంటున్నారు. ప్రజలకు చేరువగా ఉండాల్సిన ఇలాంటి కార్యక్రమాలపై అధికారులు మరింత విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ప్రజావాణిని సద్వినియోగం చేసుకోండి: ఎంపీడీఓ సృజన సాహిత్య మండలంలోని ప్రజలందరూ ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మోమిన్‌పేట్ ఎంపీడీఓ సృజన సాహిత్య కోరారు. ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను అధికారులకు తెలియజేయాలని సూచించారు.

# 111 జీవో పరిధిలో అక్రమ వెంచర్ పై కొరడా

- జన్వాడలో అనధికార లేఅవుట్ ధ్వంసం
- అక్రమ నిర్మాణాల తొలగింపు

**ప్రజా వాయిస్/ రాజేంద్రనగర్:**111 జీవో పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు, నిర్మాణాలు చేపడుతున్న వారిపై అధికారులు చర్యలు ముమ్మరం చేశారు.జన్వాడ గ్రామంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన లేఅవుట్‌పై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నార్సింగి టౌన్‌ప్లానింగ్,హెచ్ఎండిఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు సంయుక్తంగా తనిఖీలు చేపట్టాయి.ఈ సందర్భంగా అనధికారిక లేఅవుట్‌ను ధ్వంసం చేయడంతో పాటు, అక్కడ చేపట్టిన అక్రమ నిర్మాణాలు,నిర్మాణ భాగాలను తొలగించారు. నిబంధనలను ఉల్లంఘించి లేఅవుట్లు ఏర్పాటు చేయడం,నిర్మాణాలు చేపట్టడం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని అధికారులు స్పష్టం చేశారు.అక్రమ వెంచర్ల ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలకు అడ్డుకట్ట వేస్తామని అధికారులు హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే డెవలపర్లు, భూ యజమానులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు కొనసాగుతాయని తెలిపారు.కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా 111 జీవో పరిధిలోని భూముల్లో ప్లాట్లు కొనుగోలు చేసే ముందు భూమి స్థితి, వర్తించే నిబంధనలు, లేఅవుట్ అనుమతులు, సంబంధిత పత్రాలను పూర్తిగా పరిశీలించాలని సూచించారు.తొందరపడి పెట్టుబడి పెట్టి తరువాత ఇబ్బందులు పడకుండా ముందస్తు ధ్రువీకరణ తప్పనిసరి అని స్పష్టం చేశారు.









# ప్రమాదాలకు అడ్డాగా మారిన పాత ఆర్టీవో చెక్ పోస్ట్ ప్రదేశం

- ఎటువంటి పర్మిషన్ లేకుండా యాడ్ బ్లూ కేంద్రం ఏర్పాటు
- కనీస జాగ్రత్తలు పాటించని యాడ్ బ్లూ కేంద్ర యాజమాన్యం
- ఆయిల్ కోసం రోడ్డు మధ్యలోనే నిలిపి వేస్తున్న లారీలు
- పట్టించుకోని ఆర్ అండ్ బి శాఖ అధికారులు.
- తక్షణమే చర్యలు చేపట్టాలంటూ ప్రజావాణిలో జిల్లా కలెక్టర్లకు ఫిర్యాదు చేసిన స్థానికులు

**ప్రజా వాయిస్ పాల్వంచ** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల రూరల్ పరిధిలోని నాగారం కాలనీ గ్రామపంచాయతీ పరిధిలోని పాత ఆర్టీవో చెక్ పోస్ట్ ప్రదేశంలో ఎటువంటి గ్రామపంచాయతీ పర్మిషన్లు లేకుండానే రోడ్డు పక్కనే కనీస జాగ్రత్తలు కూడా పాటించకుండా యాడ్ బ్లూ అనే ఆయిల్ కేంద్రం ఏర్పాటుచేసి రోడ్డు ప్రమాదాలకు అడ్డాగా పాత ఆర్టీవో చెక్ పోస్ట్ ప్రదేశాన్ని మారుస్తున్నారంటూ స్థానిక గ్రామ ప్రజలు తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. లారీలకు మైలేజ్ రావడం కొరకు ఈ ఆయిల్ ని ఉపయోగిస్తారు. ఇటువంటి ఈ ఆయిల్ కేంద్రాన్ని రోడ్డు పక్కనే ఏర్పాటు చేసి కనీస జాగ్రత్తలు కూడా పాటించకుండా ఆయిల్ కేంద్ర యాజమాన్యం వారు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలకు లెక్కచేయకుండా వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలగజేస్తున్నారు. అంతే కాకుండా ఎటువంటి విద్యుత్ పర్మిషన్లు లేకుండా తమ ఇష్టారాజ్యంగా అక్రమంగా విద్యుత్ కనెక్షన్ ను ఏర్పాటు కూడా చేసుకున్నారు. వరస రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న యాడ్ బ్లూ సమస్త యాజమాన్యం వారితో స్థానిక గ్రామపంచాయతీ వారు ఎన్నిసార్లు సంప్రదించినా కూడా యాజమాన్యం వారు వారి మాటలను కూడా లెక్కచేయకుండా తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటూ స్థానికులు తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. ఇటువంటి ఆయిల్ కేంద్రాన్ని రోడ్డు పక్కనే కాకుండా రోడ్డు నుంచి కనీస దూర ప్రదేశంలో ఏర్పాటు చేయవలసిందిగా స్థానిక గ్రామస్తులు కోరుకుంటున్నారు. కావున భద్రాద్రి జిల్లా కలెక్టర్ మరియు ఆర్ అండ్ బి శాఖ అధికారులు ఇకనైనా తక్షణమే స్పందించి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించిన యాడ్ బ్లూ కేంద్రాన్ని నాగారం కాలనీ గ్రామపంచాయతీ పరిధిలోని పాత ఆర్టిఓ చెక్ పోస్ట్ ప్రదేశం నుండి తొలగించి యాడ్ బ్లూ కేంద్ర యాజమాన్య వారిపై కఠిన చర్యలు చేపట్టవలసిందిగా స్థానికులు కోరుకుంటున్నారు.

# గంజాయి సాగుపై కొమరం భీం పోలీసుల ఉక్కుపాదం

- జిల్లా వ్యాప్తంగా వరుస దాడులు
- 469 మొక్కలు స్వాధీనం,ఐదుగురు అరెస్ట్
- గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం
- ఎస్పీ నితికా పంత్



**ప్రజా వాయిస్,కొమరం భీం ఆసిఫాబాద్:**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చాలనే సంకల్పంతో జిల్లా ఎస్పీ నితికా పంత్ ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో అడవి చాటున, వ్యవసాయ భూముల్లో సాగు చేస్తున్న అక్రమ గంజాయి పంటపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగా గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా చేపట్టిన దాడుల్లో ఏకంగా 469 గంజాయి మొక్కలు బయటపడ్డాయి.

### సిర్పూర్(యు) మండలంలో భారీ పట్టివేత

సిర్పూర్(యు) మండలం బుర్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని జీర్లఘాట్, గుట్టగూడ గ్రామ శివారులలో కొంతమంది రైతులు తమ వ్యవసాయ భూముల్లో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్నట్లు జిల్లా పోలీసులకు పక్కా సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమైన ఎస్పీ నితికా పంత్ ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.సిర్పూర్(యు) పోలీసులు, స్పెషల్ పార్టీ సిబ్బంది కలిసి ఆయా గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వ్యవసాయ పొలాల్లో మొక్కజొన్న, వరి పంటల మధ్య అక్రమంగా పెంచుతున్న 460 గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి మూడు వేర్వేరు కేసులు నమోదు చేసి నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు.

### అరెస్ట్ అయిన నిందితుల వివరాలు:

1.గెడం లోబాజీ – జీర్లఘాట్ గ్రామం, బుర్నూర్ పంచాయతీ
2.గెడం జయవంత్ – జీర్లఘాట్ గ్రామం, బుర్నూర్ పంచాయతీ
3.కుమ్రా మాధవరావు – జీర్లఘాట్ గ్రామం, బుర్నూర్ పంచాయతీ
4.పెందోర్ సూర్యభాను – గుట్టగూడ గ్రామంవీరంతా తమకున్న కొద్దిపాటి భూమిలో, అడవికి దగ్గరగా ఎవరికీ అనుమానం రాకుండా గంజాయి సాగు చేస్తున్నట్లు విచారణలో తేలింది.

### చింతలమానేపల్లిలో పెరట్లోనే గంజాయి సాగు

మరోవైపు చింతలమానేపల్లి మండలం గూడెం గ్రామంలో కూడా పోలీసులు మరో దాడి నిర్వహించారు. గూడెం గ్రామానికి చెందిన కుంబారి శంకర్ (68), తండ్రి రాములు తన ఇంటి పెరటి స్థలంలో 9 గంజాయి మొక్కలను సాగు చేస్తుండగా పోలీసులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డాడు. స్వాధీనం చేసుకున్న మొక్కల విలువ సుమారు రూ.60,000 వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.ఈ దాడుల్లో కౌటాల సర్కిల్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్, చింతలమానేపల్లి ఎస్ఐ కమలాకర్ తమ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. నిందితుడిపై ఎన్ డి పి ఎస్ యాక్ట్ 1985 కింద కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు సీఐ తెలిపారు.

### లాభం ఆశతోనే అక్రమ సాగు

ప్రస్తుతం మార్కెట్లో గంజాయికి ఉన్న విపరీతమైన డిమాండ్, వచ్చే అధిక లాభాలే రైతులు, యువత ఈ అక్రమ దారిలోకి మళ్లడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. సాధారణ పంటతో పోలిస్తే గంజాయి సాగుతో పది రెట్లు ఎక్కువ ఆదాయం వస్తుందనే ఆశతో కొంతమంది ఈ తప్పుడు పనులకు పాల్పడుతున్నారు. అయితే దీని వల్ల చట్టపరంగా జైలు శిక్షతో పాటు, భవిష్యత్తు కూడా నాశనమవుతుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

### యువతను పట్టి పీడిస్తున్న మత్తు మహమ్మారి

జిల్లాలో ముఖ్యంగా గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల్లో యువత పెద్ద ఎత్తున గంజాయికి బానిసవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. దీని వల్ల చదువులు మధ్యలోనే ఆపేయడం, చిన్న వయసులోనే నేరాల బాట పట్టడం, కుటుంబాలు రోడ్డున పడడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఎస్పీ నితికా పంత్ ఈ ప్రత్యేక డ్రైవ్ కు శ్రీకారం చుట్టారు.

### కఠిన చర్యలు తప్పవు ఎస్పీ నితికా పంత్ హెచ్చరిక

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నితికా పంత్ మాట్లాడుతూ, జిల్లాలో గంజాయి సాగు, అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలు, ఇతర మత్తు పదార్థాల అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. గంజాయి సాగు చేసినా, రవాణా చేసినా, విక్రయించినా, కనీసం ఆ కార్యకలాపాలకు సహకరించినా కూడా ఎన్ డిపిఎస్ చట్టం కింద కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను నిత్యం గమనించాలని, ఉపాధ్యాయులు విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా అక్రమ గంజాయి సాగు, రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100కు లేదా సమీప పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తి గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా నిరంతరం ప్రత్యేక నిఘా, ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని ఎస్పీ తెలిపారు.

# ఎన్నుకోబడిన సర్పంచ్ కే రక్షణ లేదా?

- ఆసిఫాబాద్ జిల్లాలో దళిత సర్పంచ్ పై దాడి కలకలం
- ఫిర్యాదు చేసి 15 రోజులైనా అరెస్ట్ లేదు
- రాజకీయ కుట్రతోనే దాడి - సర్పంచుల సంఘం ఆరోపణ
- ఎస్పీ చొరవతోనే న్యాయం జరుగుతుందా?



**ప్రజా వాయిస్, కొమరం భీం ఆసిఫాబాద్:** కోమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలో దారుణం జరిగింది. కొత్త సార్సాల గ్రామానికి చెందిన దళిత సర్పంచ్ కొండగుర్ల ప్రకాష్ పై జరిగిన దాడి ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది.

### అభివృద్ధి చేస్తుంటే దాడి చేశారు: సర్పంచ్ ప్రకాష్

బాధిత సర్పంచ్ ప్రకాష్ చెబుతున్న దాని ప్రకారం, తాను గ్రామంలో వీధి దీపాలు వేయిస్తున్న క్రమంలో బోయిన తారా వర్గీయులు తనను అడ్డుకున్నారు. "నువ్వు దళితుడివి, నీ ఇష్టం వచ్చినట్టు చేస్తావా?" అంటూ దూషించి, చెప్పులు, కర్రలతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అదృష్టవశాత్తూ అక్కడి నుంచి పరుగెత్తి ప్రాణాలు కాపాడుకున్నానని తెలిపారు.

### ఆగస్టు 22 నుంచి తిరుగుతున్నా న్యాయం లేదు!

ఈ ఘటన ఆగస్టు 22న జరగ్గా, అదే రోజు సాయంత్రం 6:30కే ఎస్సై ఇస్లావత్ నరేష్ కు ఫిర్యాదు చేశారు. తర్వాత సీఐ, డీఎస్పీ దృష్టికి కూడా తీసుకెళ్లారు. కానీ పోలీసులు మాత్రం చిన్న చిన్న సెక్షన్లతో కేసును నీరుగార్చారని ఆరోపణ.బాధితుడు ఇచ్చిన ఫిర్యాదులో బోయిన అక్షయ, బోయిన ఇందు, బోయిన శంకర్, బోయిన పోషం, దగమ శిరివెల్ల, దగమ రాజు, బోయిరే లక్ష్మి అనే 7 మంది పేర్లను స్పష్టంగా పేర్కొన్నప్పటికీ, ఇప్పటివరకు ఒక్కరిని కూడా అరెస్ట్ చేయలేదు.

### రంగంలోకి దిగిన సర్పంచుల సంఘం

బాధితుడు ఒక్కడే కాదు, యావత్ సర్పంచుల సంఘం అతనికి మద్దతుగా నిలిచింది. జిల్లా అధ్యక్షుడు సంతోష్ డోంగ్రె, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ బుర్స పోచయ్య నేతృత్వంలో సోమవారం జిల్లా ఎస్పీ నితికా పంత్ ను కలిశారు.స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లయినా దళితులపై దాడులు ఆగడం లేదు. ఎన్నుకోబడిన సర్పంచ్ కే రక్షణ లేకపోతే సామాన్య దళితుల పరిస్థితి ఏమిటి? ఇది రాజకీయ కుట్రతోనే జరిగిన దాడి. పోలీసులు దర్యాప్తు పేరుతో కేసును సాగదీస్తున్నారు. ఇది సర్పంచులందరి ఆత్మగౌరవ సమస్య" అని సర్పంచుల సంఘం నాయకులు ఎస్పీకి తెలిపారు.

### బాధితుడి ఆవేదన

నాకు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం, హత్యాయత్నం కేసు ప్రకారం న్యాయం కావాలి. నిందితులను వెంటనే జైలుకు పంపాలి. లేకపోతే నేను ఎస్సీ,ఎస్టీ కమిషన్ కు వెళ్లి, కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తా" అని సర్పంచ్ కొండగుర్ల ప్రకాష్ డిమాండ్ చేశారు.రాజ్యాంగంపై, పోలీసు వ్యవస్థపై నమ్మకంతో ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పుడు జిల్లా ఎస్పీ నితికా పంత్ ఈ కేసులో ఎలాంటి చర్యలు తీసుకుంటారో అని జిల్లా ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# మూడు వార్డుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

- ఎస్పీకి వినతిపత్రం అందజేసిన జాతీయ మాలల ఐక్యవేదిక నాయకులు



**ప్రజా వాయిస్.. వనపర్తి** వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 5వ, 20వ, 21వ వార్డుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం వనపర్తి జిల్లా ఎస్పీ కార్యాలయంలో జాతీయ మాలల ఐక్యవేదిక నాయకులు ఎస్పీకి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆయా వార్డుల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు, మాదకద్రవ్యాల వినియోగానికి అలవాటు పడుతున్న యువతను సన్మార్గంలోకి తీసుకురావడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ముఖ్యంగా యువత డ్రగ్స్ బారిన పడకుండా పర్యవేక్షణ, అవగాహన చర్యలు అవసరమని పేర్కొన్నారు.వినతిపత్రంపై ఎస్పీ సానుకూలంగా స్పందిస్తూ ఆయా వార్డుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా ఉండేందుకు జాతీయ మాలల ఐక్యవేదిక ఆలోచించడం అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా జాతీయ మాలల ఐక్యవేదిక అధ్యక్షులు మాదారి భోజరాజు, గౌరవాధ్యక్షులు మాదారి సూర్యబాబు, ఉపాధ్యక్షులు మద్దెల కరుణాకర్, కార్యవర్గ సభ్యులు బండారి రాజ్‌కుమార్, మాదారి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

# భూ లావాదేవీల వివాదమే కారణమా?

- తహశీల్దార్ ను వెంబడించిన దుండగులు!
- భూ వివాదాల నేపథ్యంలో ప్రాణభయం
- రక్షణ కోరిన తహశీల్దార్!




**ప్రజా వాయిస్ / మంచిర్యాల**/క్రైమ్ మంచిర్యాల జిల్లా మందమర్రి తహశీల్దార్ సతీశ్ కుమార్ శర్మను లక్ష్యంగా చేసుకుని దుండగులు దాడికి యత్నించిన ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. రాత్రి సమయంలో సంతోష్ అనే వ్యక్తి మరో ఇద్దరితో కలిసి తనను వెంబడించాడని బాధితుడు స్వయంగారామకృష్ణాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది.ఈ భయానక ఘటనపై తహశీల్దార్ సతీశ్ కుమార్ శర్మ స్పందిస్తూ.. తన ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తనకు తక్షణమే తగిన పోలీసు రక్షణ కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎంతటి ఒత్తిళ్లు ఎదురైనా, బెదిరింపులు వచ్చినా న్యాయం కోసం చివరి వరకు పోరాడుతానని ఆయన తేల్చి చెప్పారు.భూ లావాదేవీల వివాదాలే కారణమా?మండలంలో ఇటీవలి కాలంలో జరుగుతున్న పలు భూ లావాదేవీల వివాదాలే ఈ దాడి యత్నానికి ప్రధాన కారణమై ఉండవచ్చని స్థానికంగా జోరుగా చర్చ సాగుతోంది. రెవెన్యూ రికార్డులు, వివాదాస్పద భూముల కేటాయింపులపై ఆయన పట్టుదలగా ఉండటమే ఈ కక్షలకు దారితీసిందనే కోణంలో గుసగుసలు వినిపిస్తున్నాయి.పోలీసుల దర్యాప్తు ముమ్మరం..తహశీల్దార్ ఫిర్యాదు మేరకు రామకృష్ణాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును వేగవంతం చేశారు. రాత్రి పూట తహశీల్దార్‌ను వెంబడించిన వ్యక్తులు ఎవరు? వారి వెనుక ఎవరి హస్తం ఉందనే కోణంలో సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఒక రెవెన్యూ అధికారినే టార్గెట్ చేస్తూ జరిగిన ఈ ఘటన స్థానిక అధికారుల్లో తీవ్ర భయాందోళనలను కలిగిస్తోంది.

# హమారా ప్రసాద్‌ను వెంటనే అరెస్టు చేయాలి



**ప్రజా వాయిస్, కోరుట్ల:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను కించపరుస్తూ 'కల్పిత నాయకుడు' పుస్తకాన్ని రాసిన హమారా ప్రసాద్‌ను వెంటనే అరెస్టు చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కోరుట్ల ఆర్డీఓ కార్యాలయంలో డి.టి. రాజ్ మహమ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎం.జె.ఎఫ్. రాష్ట్ర నాయకుడు చెట్టుపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ.. సమాజంలో విద్వేషాలు రగిలిస్తున్న హమారాప్రసాద్ పుస్తక ఆవిష్కరణను రద్దు చేయాలని, అతని సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేయాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముఖిని పెల్లి గంగా నర్సయ్య, జాగర్ల రాజం, కొంతం గంగరాజం,bబంగారి రాజం, కొమ్ము శేఖర్, నిఘా రమేష్, లింగంపల్లి నరేష్, జాగర్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు
- కార్మికులకు రోడ్డు భద్రతపై అవగాహన
- హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో రైస్ మిల్లులు, ఇటుక బట్టీలు, ఇతర పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు రోడ్డు భద్రత, గంజాయి, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు, ప్రాణనష్టంతో పాటు చట్టపరమైన ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు.కార్మికులకు వీటిపై యాజమాన్యాలు నిరంతరం అవగాహన కల్పించాలని సీఐ రంజిత్ రావు, ఎస్ఐ చంద్ర కుమార్ కోరారు.



# మెడిసిన్ సీటు - పేదింటి ప్రతిభకు చేయూత

- నీట్ లో సత్తా చాటిన భార్గవ్ అశోక్ కు రూ.50 వేల ఆర్థిక సాయం అందించిన మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణ రెడ్డి

**ప్రజా వాయిస్/ రాజేంద్రనగర్:** ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పట్టుదలతో చదివి వైద్య విద్యలో సీటు సాధించిన విద్యార్థికి మణికొండ మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి అండగా నిలిచారు. నీట్–2026లో ప్రతిభ కనబరిచి డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి వైద్య కళాశాలలో మెడికల్ సీటు సాధించిన యు.భార్గవ్ అశోక్‌కుమార్‌కు రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు.మణికొండ పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ లో 2022లో పదో తరగతి పూర్తి చేసిన భార్గవ్, ఇంటర్మీడియట్‌ను టీ.ఎస్.ఆర్.జె.సి సర్వేల్‌లో చదివి 1000 మార్కులకు 955 మార్కులు సాధించారు.తండ్రి వెంకటరత్నం తాపీ మేస్త్రిగా, తల్లి అలివేలు గృహిణిగా కుటుంబాన్ని నెట్టుకొస్తున్నప్పటికీ, ఆర్థిక పరిస్థితులను అధిగమించి విద్యలో ప్రతిభ చాటారు.విద్యార్థి కుటుంబ పరిస్థితులను తెలుసుకున్న రామకృష్ణారెడ్డి,ఉన్నత చదువులకు అండగా నిలుస్తూ ఆర్థిక సహాయం అందించారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా మారకూడదని,వారిని ప్రోత్సహించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.భార్గవ్ అశోక్‌కుమార్ భవిష్యత్తులో మంచి వైద్యుడిగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని రామకృష్ణారెడ్డి ఆకాంక్షించారు.విద్యార్థి కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

# శంకుస్థాపనలు జరిగాయి .. సీసీ రోడ్లు మాత్రం జాడే లేవు!

- కాంట్రాక్టర్ల కోసం ఎదురు చూస్తున్న వల్మిడి గ్రామ ప్రజలు
- ప్రభుత్వం మారినా.. ప్రజల కష్టాలు మారలేదంటున్న గ్రామస్తులు



**ప్రజా వాయిస్ / పాలకుర్తి** / సెప్టెంబర్ 07పాలకుర్తి మండలం వలిమిడిగ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు జరిగి రోజులు గడుస్తున్నా పనులు మాత్రం ప్రారంభం కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాల్సిన కాంట్రాక్టర్లు ఎక్కడున్నారో తెలియని పరిస్థితి నెలకొందని ఆరోపిస్తున్నారు.గ్రామంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. శంకుస్థాపన చేసి అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చినా క్షేత్రస్థాయిలో పనులు ముందుకు సాగడం లేదని అంటున్నారు.ప్రభుత్వం మారినా ప్రజల కష్టాలు మాత్రం మారలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాంట్రాక్టర్లతో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# పెద్దమ్మ తల్లి ఆలయానికి రూ.50 వేల విరాళం

- ఆలయ అభివృద్ధికి చేయూత.. గుర్రపు మచెందర్ కు గ్రామ ప్రజల కృతజ్ఞతలు



**పెద్ద శంకరం పేట ప్రజా వాయిస్:**మల్కాపూర్ గ్రామంలోని శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి గుర్రపు మచెందర్ రూ.50 వేల విరాళాన్ని అందించారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు తన వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ విరాళాన్ని అందించినట్లు ఆయన తెలిపారు.పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి తమవంతు సహకారం అందించడం అభినందనీయమని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తి భావంతో రూ.50 వేల విరాళం అందించిన గుర్రపు మచెందర్‌కు ఆలయ నిర్వాహకులు, గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# పలిమెల ప్రజావాణిలో అర్జీల స్వీకరణ

- ఒక్కటే ఫిర్యాదు
- అనంతరం కెజిబివి, పాఠశాలల్లో ఎంపీడీవో ఆకస్మిక తనిఖీలు
- ఎంపీపీఎస్ లో విద్యార్థులకు ఉచిత యూనిఫామ్ ల పంపిణీ

**ప్రజా వాయిస్ పలిమెల**స్థానిక మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల స్థాయి అధికారులు 12 మంది హాజరై ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఇందులో భాగంగా లెంకలగడ్డ గ్రామానికి చెందిన ఒక రెవెన్యూ సమస్యకు సంబంధించి వినతిపత్రం అందింది. అర్జీని పరిశీలించిన అధికారులు, దానికి త్వరితగతిన పరిష్కారం చూపేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ అనంతరం ఎంపీడీవో స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. అలాగే విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలు, వసతులపై పూర్తిస్థాయిలో ఆరా తీశారు. విద్య, భోజనం, ఇతర మౌలిక వసతుల కల్పనలో అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పలిమెల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ కార్యక్రమం చేపటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోతో పాటు ఏపీఎం, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారుల మాటలాడుతూ... ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలని సూచించారు.



# సింగరేణి మారుపేర్ల సమస్యను పరిష్కరిస్తాం

**- డిప్యూటీ సీఎం భట్టి**
**- లక్కా శ్రావణ్ గౌడ్ ఆధ్వర్యంలో సుదీర్ఘ పోరాటాలకు లభించిన గుర్తింపు**
**- శాసనమండలిలో ప్రస్తావించినందుకు కృతజ్ఞతలు తెలిపిన మారుపేర్ల సంఘం**

**ప్రజా వాయిస్ గోదావరిఖని**

సింగరేణి కాలరీస్‌లో సుదీర్ఘకాలంగా నలుగుతున్న మారుపేర్లు విజిలెన్స్ పెండింగ్ కేసుల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క్ తెలంగాణ శాసనసభ సాక్షిగా స్పష్టం చేశారు. ఈ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించినందుకు గోదావరిఖని కి చెందిన సింగరేణి మారుపేర్ల సంఘం అధ్యక్షుడు లక్కా శ్రావణ్ గౌడ్ డిప్యూటీ సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ?గత కొన్నేళ్లుగా మారుపేర్ల సంఘం అధ్యక్షుడు లక్కా శ్రావణ్ గౌడ్ నాయకత్వంలో బాధితులు అనేక పోరాటాలు, ధర్నాలు, దీక్షలు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం శాసన మండలి సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క్ మాట్లాడుతూ.. సింగరేణి మారుపేర్ల సమస్య పరిష్కారానికై ఇప్పటికే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. బాధితులకు ఉద్యోగాలు కల్పిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని, త్వరలోనే తుది పరిష్కారం చూపిస్తామని ఆయన ప్రకటించడంతో బాధితుల్లో కొత్త ఆశలు చిగురించాయి.

**త్వరగా ప్రక్రియ పూర్తి చేయాలి- శ్రావణ్ గౌడ**

పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం నుంచి ఈ సానుకూల స్పందన వచ్చిందని శ్రావణ్ గౌడ్ పేర్కొన్నారు. దశాబ్దాలుగా ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న బాధిత కుటుంబాల ఆవేదనను అర్థం చేసుకుని కమిటీ నివేదికను వేగవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎలాంటి ఆలస్యం చేయకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ త్వరితగతిన ఉద్యోగ అవకాశాలు కల్పించి న్యాయం చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు.



ఫైల్ ఫోటో




## కేయూ జంక్షన్ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

**ప్రజా వాయిస్ హన్మకొండ / కాకతీయ యూనివర్సిటీ**

తెలంగాణ రాష్ట్రంలో ఫీజు రియంబర్స్మెంట్ తో పాటుగా, జీవో నెంబర్ 97వ తీసుకురావడంతో పాలిటెక్నిక్ విద్యార్థులకు తీవ్ర నష్టం చేకూరుతుందని, వెంటనే ప్రభుత్వం జీవో నెంబర్ 98 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ హన్మకొండ లోని కె యూ జంక్షన్ వద్ద, ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సంతోష్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు...

# డిండి ఆయకట్టు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**-నీళ్ల విషయంలో తెలంగాణ ప్రభుత్వం రైతులకు మోసం**
**-కేఎల్ఐ ద్వారా వెంటనే డిండి ప్రాజెక్టును నింపాలి**
**-దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**

**ప్రజా వాయిస్/దేవరకొండ**

డిండి మండల కేంద్రంలో సోమవారం బీ ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా బీ ఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రామావత్ రవీంద్ర కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నీళ్ల విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ద్రోహం, మోసం చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. డిండి ప్రాజెక్టును కె ఎల్ ఐ ద్వారా నింపి, డిండి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కే ఎల్ ఐ ద్వారా డిండి ప్రాజెక్టును నింపిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చి రైతుల పొలాలకు నీరు అందించిందని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం డిండి ప్రాజెక్టు, ఆయకట్టు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. డిండి ప్రాజెక్టును కే ఎల్ ఐ ద్వారా వెంటనే నింపి, ఆయకట్టు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. డిండి ప్రాజెక్టును కే ఎల్ ఐ ద్వారా నింపే వరకు, డిండి ఆయకట్టు రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. బిఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాజీనేని వెంకటేశ్వర రావు అధ్యక్షతన జరిగిన ఈ మహాధర్నాలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్, నేనావత్ కిషన్ నాయక్, పి ఎ సీ ఎస్ చైర్మన్లు పల్లా ప్రవీణ్ రెడ్డి, మాధవరం శ్రీనివాస్ రావు, సర్పంచులు మల్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, కృష్ణయ్య, పట్టణ అధ్యక్షులు గిరమోని శ్రీను, బలుముల తిరుపతయ్య, రషీద్, రామావత్ వెంకట్రామ్, తండు వెంకటయ్య, బొడ్డుపల్లి జయంత్, తండు చంద్రయ్య, సుంకరి చంద్రయ్య, ఓర్సు ముత్యాలు , నాయకులు, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.





## కాగజ్‌నగర్ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**

కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న 220 మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ, డీఆర్డీఏ ఏపీడీ బానోత్ దత్తా ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని 46 గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి ఒక జత యూనిఫాం అందజేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సుమారు 9,200 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరి విద్య, ఆరోగ్యం, వసతి, భోజనం, దుస్తుల అవసరాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. యూనిఫాంలు అందుకున్న విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెద్దవూర మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుల పై పోలీస్ గుండా గిరి..

**అధికార పార్టీకి తోత్తులుగా వ్యవహరిస్తున్న పోలీసులు....**
**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన పట్ల ప్రజలు ఎవరు సంతృప్తిగా లేరన్నారు....**
**రాష్టంలో ఫాసిస్టు పాలన, పోలీస్ పాలన కొనసాగుతుందని ఆరోపించారు....**
**ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు....**

**ప్రజా వాయిస్/ నల్గొండ క్రైమ్:**

రాష్ట్ర శాసనసభ సమావేశాలు ప్రారంభమైన వేళ నల్ల చొక్కాలతో వెళ్ళిన బీ ఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులను ప్రభుత్వం పోలీసులతో అడ్డుకోవడానికి నిరసిస్తూ నాగార్జునసాగర్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు భగత్ కుమార్ ఆధ్వర్యంలో పెద్దవూర మండల కేంద్రంలో హైదరాబాద్ నాగార్జునసాగర్ జాతీయ రహదారిపై ప్రజాస్వామహితంగా రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రాస్తారోకో వద్దకు వచ్చి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల పట్ల అనుచితంగా వ్యవహరించిన ఎస్సై, పోలీసులు పోలీసుల దౌర్జన్యం నశించాలంటూ రోడ్డుపై బైఠాయించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధికార పార్టీకి తోత్తులుగా వ్యవహరిస్తున్న పోలీసులు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కూని అయిందని అన్నారు. రాష్టంలో ఫాసిస్టు పాలన, పోలీస్ పాలన కొనసాగుతుందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రజాస్వామ్యతంగా నిరసన వ్యక్తం చేసే హక్కులు కూడా కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండగా ప్రతిపక్ష పార్టీల నాయకుల పట్ల ఈ రకంగా అప్రజా స్వామికంగా వ్యవహరించలేదని తెలిపారు. పోలీసులు చట్టపరిధిలో వ్యవహరించాలని సూచించారు. కాదు కూడదు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు లాగా పనిచేస్తాం అని హద్దు మీరి వ్యవహరిస్తే రెండేళ్ల తర్వాత తమ బీఆర్ఎస్ పార్టీ అధికారంలో వచ్చిన తర్వాత ఆరోజు చట్టం తన పని తాను చేసుకుపోతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొనసాగిన ఈ వెయ్యి రోజుల కాలంలో లక్ష దుర్మార్గాలకు పాల్పడిందని విమర్శించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలతోపాటు 420 హామీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేడు అధికారంలోకి వచ్చి ?1000 పూర్తయిన శాసనసభ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు ప్రభుత్వం కేసీఆర్ కుటుంబాన్ని బదనాం చేయడం మాని 6 గ్యారంటీలు 420 అమలుపై దృష్టి సారించాలని హితువు పలికారు. రాష్టంలో కాంగ్రెస్ పార్టీకి పోకడ గంతల కాలం వచ్చిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన పట్ల ప్రజలు ఎవరు సంతృప్తిగా లేరని తెలిపారు. విద్యార్థులు యువత నిరుద్యోగులు రైతులు కార్మికులు, కర్షకులు వృద్ధులు వికలాంగులు ఇలా అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని విమర్శించారు. అనంతరం ఆరుగారంటీలు 420 అమలు చేయాలని కోరుతూ మండల ఎంపీడీవో కు వినతి పత్రం అందజేశారు.



## బెల్లంపల్లి కేజీబీవీ బాలికల హాస్టల్‌లో విద్యార్థుల ఆవేదన

**మెనూ సిస్టమ్ అమలుపై ప్రశ్నలు**
**విద్యార్థులకు రావాల్సిన డబ్బులపై అడిగితే నిర్లక్ష్యపు సమాధానాల ఆరోపణలు**



**ప్రజా వాయిస్ బెల్లంపల్లి రూరల్**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని కేజీబీవీ బాలికల హాస్టల్‌లో విద్యార్థినులు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్‌లో అమలు చేయాల్సిన మెనూ సిస్టమ్ సక్రమంగా కొనసాగడం లేదని, విద్యార్థినులకు రావాల్సిన డబ్బుల విషయంలో కూడా సరైన సమాచారం ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. సమస్యలపై అడిగితే "మీకు దిక్కు ఉన్న చోట వెళ్లి చెప్పుకోండి" అంటూ సమాధానం ఇస్తున్నట్లు విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. మరోవైపు హాస్టల్‌కు సంబంధించిన సిస్టమ్ ఆపరేటర్ సమయపాలన పాటించకుండా విధులకు హాజరవుతున్నారని, దీంతో విద్యార్థినులకు సంబంధించిన పలు పనులు ఆలస్యమవుతున్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా, హాస్టల్‌లో నెలకొన్న సమస్యలపై విద్యార్థినుల తల్లిదండ్రులు ప్రశ్నించినప్పుడు "టీసీ తీసుకుని వెళ్లండి" అంటూ బెదిరిస్తున్నట్లు కూడా ఆరోపణలు వస్తున్నాయి. పిల్లల సమస్యల గురించి అడిగిన తల్లిదండ్రులతో ఇలాంటి వైఖరి సరికాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థినుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన కేజీబీవీ బాలికల హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# వన్నీగూడలో వింత జంతువు కలకలం

**పశువుల దొడ్డిలో దూడలను పిక్కతిన్న జంతువేది ?**
**చిరుత లేక వింత జంతువేదయిన నా అనే అనుమానం లో రైతులు**
**పశువుల దొడ్డిలోకి చొరబడి దూడలను చంపుతున్న గుర్తుతెలియని జంతువు**
**వింత జంతువు దాడిలో మూడు దూడలు మృతి.**
**ఎవ్వరు పట్టించుకోవడం లేదని వన్నిగుడ రైతులు ఆవేదన**

**ప్రజావాయిస్, కీసర :**

మేడ్చల్ జిల్లా కీసర మండలం కీసర అనుబంధ గ్రామం వన్నీగూడ గ్రామంలో గుర్తుతెలియని జంతువు సంచారం. రైతులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తోంది. రాత్రి వేళల్లో పశువుల దొడ్డిలోకి చొరబడుతున్న ఆ జంతువు ఇప్పటికే మూడు దూడలను చంపినట్లు రైతులు చెబుతున్నారు. దూడల శరీరాలపై గాయాలు కనిపించడంతో పాటు రక్తం పీల్చిన ఆనవాళ్లు ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుస ఘటనలతో గ్రామంలోని పశువుల కాపరులు రాత్రిపూట తమ పశువులను బయట ఉంచేందుకు భయపడుతున్నారు. ఇదే జంతువు మరింత పెద్ద పశువులపై , రైతులపై దాడి చేస్తే పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు. తమకు నష్టం జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. వెంటనే వెటర్నరీ, అటవీ శాఖ అధికారులు గ్రామానికి చేరుకుని దాడులకు కారణమైన జంతువును గుర్తించి, దానిని పట్టుకునేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అధికారులు గ్రామంలో ఘటనాస్థలాన్ని పరిశీలించి పాదముద్రలు, సీసీ కెమెరా దృశ్యాలు తదితర ఆధారాలను సేకరించి జంతువు ఏదో నిర్ధారించాల్సిన అవసరం ఉంది. మూడు దూడలను కోల్పోయాం.. ఇక మిగిలిన పశువుల పరిస్థితి ఏమిటోనని భయంగా ఉంది.



అధికారులు వెంటనే స్పందించి మాకు రక్షణ కల్పించాలి" అని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. పంట పొలాలకు వెళ్లాలంటే బయమేస్తుందని , పశువులను మేపటానికి కూడా గ్రామస్థులు బయంవడుతున్నావుని అంటున్నారు. సంబంధిత అధికారులు మా గ్రామాన్ని సందర్శించి పూర్తి విచారణ చేసి, ఆ వింత జంతువును బంధించాలని గ్రామస్తులు రైతులు కోరుతున్నారు. పంట పొలాలకు వెళ్లడానికి కూడా జంకుతున్నామని రైతులు వాపోతున్నారు. ఎప్పుడు ఎక్కడినుండి ఆ జంతువు వచ్చి తమపై దాడి చేస్తుందోనని రైతులు తీవ్రమైన భయాందోళనకు గురవుతున్నామని చెబుతున్నారు. రైతుల ప్రాణాలు పోతే కానీ అధికారులు స్పందించర అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు....

# బీజేపీ నేతల ముందస్తు ఆరెస్ట్ అప్రజాస్వామికం

- ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి
- విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న రేవంత్ సర్కార్
- అక్రమ ఆరెస్టులు కాంగ్రెస్ సర్కార్ పిరికి పంద చర్య
- బీజేపీ తుంగతుర్తి అసెంబ్లీ కో కన్వీనర్ వెంకటేశ్వర్ రావు



**ప్రజా వాయిస్/ అడ్డగూడూరు:**
భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు పిలుపు మేరకు సోమవారం ఛలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంకు బీజేపీ నాయకులు వెళ్లకుండా పోలీసులు ముందస్తు ఆరెస్టులు చేయడం అప్రజాస్వామికమని బీజేపీ తుంగతుర్తి అసెంబ్లీ కో కన్వీనర్ కూరాకుల వెంకటేశ్వరరావు అన్నారు. విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని అసెంబ్లీ ముట్టడికి పిలుపునిస్తే ముందస్తు అరెస్టులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థులకు చెల్లించాల్సిన బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకపోవడంతో కళాశాలలు, సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరి వలన విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని పేర్కొన్నారు. బీజేపీ ఎల్లప్పుడు విద్యార్థుల పక్షంగా పోరాటం చేస్తుందని అన్నారు. అరెస్ట్ చేసిన వారిలో బీజేపీ నాయకులు నవీన్, కుమారస్వామి తదితరులు ఉన్నారు.



# హాలియాలో ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూనిఫాం, షూస్ పంపిణీ...

**ప్రజా వాయిస్/ అనుముల:**
రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా, హాలియా మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూనిఫాం మరియు షూస్ పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రరెడ్డి మరియు వైస్ చైర్మన్ గౌని రాజ రమేష్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు యూనిఫామ్‌లు, షూస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు కావాల్సిన అన్ని వసతులను ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాలను ఉపయోగించుకుని చదువులో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ బొంగరాల యేసు రాజు, కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు, కౌన్సిలర్ సలహాదారులు నకిరేకంటి సైదులు, మజహార్ మొయినుద్దీన్,చిట్టిపోలు కరుణాసాగర్, గడ్డం రమణయ్య , కుకడాల ఆంజనేయులు, మద్దిమడుగు కిషోర్ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయపాల్ రెడ్డి బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం దళిత జాతిని కించ పరిచినట్టే

**ప్రజా వాయిస్/ అడ్డగూడూరు:**
దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధుసుధన్ చేసిన వ్యాఖ్యలు దళిత జాతిని కించ పరిచినట్టేనని ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మందుల వెంకటేష్ సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ప్రాంగణం ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మరియు ఎమ్మెల్సీలు చేస్తున్న నిరసనలో తాత మధుసూదన్ స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసినట్టేనని అన్నారు. తాత మధుసూదన్ తో అట్టి వ్యాఖ్యలు చేయించింది కేటీఆర్, హరీష్ రావులే నని వారిపై కూడా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

# తెలంగాణలో అక్షరాస్యత: పురోగతితో పాటు సవాళ్లు

**ప్రజా వాయిస్, హుజూర్ నగర్, సెప్టెంబర్ 07**
తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 నాటికి రాష్ట్ర అక్షరాస్యత రేటు 66.54 శాతంగా నమోదైంది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత విద్యారంగంపై ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలు, పాఠశాల విద్య విస్తరణ, విద్యార్థుల పాఠశాలల్లో కొనసాగింపునకు చర్యలు అక్షరాస్యతలో క్రమంగా మెరుగుదల కనిపిస్తున్నట్లు అందుబాటులో ఉన్న వివిధ నమూనా సర్వేలు, విద్యా గణాంకాలు సూచిస్తున్నాయి.అయితే అక్షరాస్యత పెరుగుతున్నప్పటికీ తెలంగాణలో విద్యా సమానత్వం ఇంకా పూర్తిస్థాయికి చేరలేదు. ముఖ్యంగా మహిళలు, గ్రామీణ ప్రాంత ప్రజలు, సామాజికంగా మరియు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల్లో అక్షరాస్యత, విద్యా ప్రాప్తిలో అంతరాలు కొనసాగుతున్నాయి. దీంతో కేవలం అక్షరాస్యత శాతం పెరగడమే కాకుండా ప్రతి వర్గానికీ నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావడం కీలకంగా మారింది.

**పాఠశాల విద్యకు విస్తరణ**
రాష్ట్ర ఏర్పాటు అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదల, డిజిటల్ విద్య, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం వంటి పథకాల ద్వారా పాఠశాల విద్యను మరింత అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు కొనసాగాయి. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల చేరిక, పాఠశాలల్లో



కొనసాగింపు పెంచడం ద్వారా విద్యకు దూరంగా ఉన్న వర్గాలను ప్రధాన విద్యా ప్రవాహంలోకి తీసుకురావడానికి ప్రయత్నాలు జరిగాయి.

**మహిళా అక్షరాస్యతపై ప్రత్యేక దృష్టి**
తెలంగాణ అక్షరాస్యతలో మహిళా విద్య కీలకమైన అంశంగా ఉంది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు, గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సదుపాయాల లభ్యత, బాలికల విద్య మధ్యలోనే నిలిచిపోవడం వంటి అంశాలు మహిళా అక్షరాస్యతపై ప్రభావం చూపుతున్నాయి. అందువల్ల బాలికల పాఠశాల విద్యతో పాటు వయోజన మహిళల అక్షరాస్యతను పెంచే కార్యక్రమాలు కూడా మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది.

**గ్రామీణ, పట్టణ అంతరం సవాలే**
పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో విద్యా అవకాశాలు, నాణ్యమైన ఉపాధ్యాయుల లభ్యత, డిజిటల్ వనరుల వినియోగం వంటి అంశాల్లో వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో పాఠశాలలకు రాకపోకలు, కుటుంబాల ఆర్థిక పరిస్థితులు, విద్యపై అవగాహన వంటి అంశాలు పిల్లల విద్యపై ప్రభావం చూపుతున్నాయి.

**అక్షరాస్యత నుంచి నాణ్యమైన విద్య వైపు**
రాష్ట్రంలో అక్షరాస్యత పెరుగుతున్న ధోరణి సానుకూల పరిణామమే అయినప్పటికీ, చదవడం, రాయడం మాత్రమే కాకుండా విద్యార్థుల్లో ప్రాథమిక అభ్యసన సామర్థ్యాలు, డిజిటల్ అక్షరాస్యత, ఉన్నత విద్యకు అవకాశాలు, ఉపాధి నైపుణ్యాలు పెంపొందించడం తదుపరి దశలో ప్రధాన లక్ష్యాలుగా ఉండాలి.మొత్తంగా చూస్తే, 2014లో 66.54 శాతం అక్షరాస్యతతో ప్రారంభమైన తెలంగాణ ప్రయాణం క్రమంగా ముందుకు సాగుతున్నప్పటికీ, రాష్ట్రంలోని ప్రతి కుటుంబం, ప్రతి గ్రామం, ప్రతి సామాజిక వర్గానికి సమాన విద్యా అవకాశాలు అందినప్పుడే అక్షరాస్యతలో పూర్తి పురోగతి సాధించినట్లవుతుంది. అక్షరాస్యత శాతం పెరగడం ఒక మైలురాయి మాత్రమే.. విద్యలో సమానత్వం సాధించడమే అసలు లక్ష్యం.

# అసెంబ్లీకి దారులు మూసినా.. ప్రజా సమస్యలకు దారులు మూయలేరు!

**బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం అప్రజాస్వామికం**

**కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై బీఆర్ఎస్ నాయకులు పిల్లుట్ల రఘు ఆగ్రహం**

**ప్రజా వాయిస్, హుజూర్ నగర్, సెప్టెంబర్ 07**
ప్రజల ఓట్లతో గెలిచి అసెంబ్లీలో ప్రజల తరఫున ప్రశ్నించేందుకు వచ్చిన బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీ గేటు వద్దే అడ్డుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరికి పరాకాష్ట అని హుజూర్ నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు పిల్లుట్ల రఘు విమర్శించారు.ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలను ప్రస్తావించకుండా అడ్డుకోవడం, పోలీసు బలాన్ని ఉపయోగించి వారిని నిర్బంధించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు ఆరోపించారు. అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రతిపక్షం ప్రశ్నించే హక్కును గౌరవించాలని డిమాండ్ చేశారు.అధికారం శాశ్వతం కాదు.. ప్రజల తీర్పే అంతిమం. అసెంబ్లీ గేట్లు మూసేయవచ్చు.. కానీ ప్రజల ప్రశ్నలకు గేట్లు వేయలేరని పిల్లుట్ల రఘు ఆగ్రహం వ్యక్తం చేశారు ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అడ్డుకోవడాన్ని రఘు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం కూడా ప్రజల గొంతేనని, ప్రజల హక్కులను అణచివేసే ప్రయత్నాలను



ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. ప్రజల గొంతును అడ్డుకోవచ్చు..కానీ ప్రజల తీర్పును అడ్డుకోలేరని ఆయన తెలిపారు

# హామీలు అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**బీఆర్ఎస్ పార్టీ,మండలఅధ్యక్షులు కరుణాకర్ రెడ్డి**

**ప్రజావాయిస్ వేములపల్లి:**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందుఇచ్చినఆరుగ్యారెంటీలు, 420హామీలను అమలు చేయడం లోఘోరంగావిఫలమైందనిబీఆర్ ఎస్ వేములపల్లి మండల అధ్యక్షు లు నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి ఆరోపించారు. సోమవారం ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్ కు వినతిపత్రంఅందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చే ముందుప్రజలను ఆకర్షించేందుకు అనేకహామీలుఇచ్చిందని,అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా ప్రజలను తీవ్రఇబ్బందు లకుగురిచేస్తోందన్నారు.రైతు సమ స్యలను ప్రస్తావిస్తూ.. గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు సకాలంలో అందేదని, ఇప్పుడు సకాలంలో రాకపోవడం వల్ల రైతులు పెట్టు బడికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతుబీమా పథకాన్ని సమర్థవంతంగాకొనసాగించి అన్నదాత కుటుంబాలకు భరోసా కల్పించాలన్నారు.సాగునీటివిషయంలో



ప్రభుత్వతీరునుతప్పు బట్టారు. ప్రస్తుతం నాగార్జునసాగర్ లో 535 అడుగులు, శ్రీశైలం ప్రాజెక్టులో 874 అడుగుల నీటిమట్టం ఉన్నప్పటికీ రెండు పంటలకు నీటిని విడుదల చేయడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోందని, వెంటనే కాలువలకు నీటినివిడుదలచేసిరైతులనుఆదుకోవాలనిడిమాండ్,చేశారు .యూరి యా కొరతపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్లో రైతులు యూరియా కోసం గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సి వస్తోందని, యాప్ ద్వారా పంపిణీ విధానంలోసాంకేతికసమస్యలుతలెత్తుతున్నాయని,వెంటనే పరిష్కరించి రైతులకు అవసరమైన మేరకు యూరియా,ఎరువు లు, విత్తనాలు సకాలంలో అందేలా శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరారు.
కళ్యాణలక్ష్మి,షాదీముబారక్ పథకాల లబ్ధిదారులకు పెండింగ్ లో ఉన్న ఆర్థిక సహాయాన్ని వెంటనే విడుదల చేయాలని, విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయి లను చెల్లించి పేద, మధ్యతరగతి విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయ కుండా రైతులు, విద్యార్థులు, మహిళలు, పేద కుటుంబాలను మోసం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతుబంధు, రైతుబీమా, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఫీజు బకాయిలను విడుదల చేయడంతో పాటు యూరియా కొరతను పరిష్క రించాలని, ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఈ వినతిపత్రం ద్వారా డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలుపై పాలకుర్తిలో మహిళల గర్జన

**కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి: ఎర్రబెల్లి ఉషా దయాకర్ రావు**

**రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది: మాజీ మంత్రి ఎర్రబెల్లి**

**ప్రజా వాయిస్/పాలకుర్తి/సెప్టెంబర్ 07**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పాలకుర్తి మండల కేంద్రంలో మహిళలు భారీ నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఎర్రబెల్లి ఉషా దయాకర్ రావు హాజరై మహిళల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఉషా దయాకర్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అంటూ ప్రజలను ఆకట్టుకుని అధికారంలోకి వచ్చిందని, వెయ్యి రోజులు గడిచినా అనేక హామీలు అమలు కాలేదని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500, 18 ఏళ్లు నిండిన యువతులకు స్కూటీలు, కళ్యాణలక్ష్మి కింద రూ.1 లక్షతో పాటు తులం బంగారం వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.మహిళలను సులభంగా మోసం చేయొచ్చని భావించడం కాంగ్రెస్ ప్రభుత్వ భ్రమేనని హామీల అమలు కోసం మహిళలు ప్రశ్నిస్తారని,



అవసరమైతే పోరాటాలు కొనసాగిస్తారని ఆమె అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కూడా మహిళేనని, మహిళలకు ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని డిమాండ్ చేశారు.మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని విమర్శించారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి ప్రభుత్వాన్ని చూడలేదని అన్నారు. ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులతో అడ్డుకోవడం, దాడులకు పాల్పడటం సరికాదని మండిపడ్డారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల కూడా ప్రభుత్వం దురుసుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ప్రజలకు ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మహిళా కార్యకర్తలు, స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ తీరుకు నిరసనగా బీఆర్ఎస్ ధర్నా

**సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం**

**ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేత**

**మునుగోడు మాజీ ఎమ్మెల్యే కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి**



ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తీవ్ర కాలయాపన చేస్తోందని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ నాయకులు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి విచ్చేసి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, హక్కుల సాధన కోసం మళ్లీ ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కేసీఆర్ హయాంలోనే రైతుబంధు, కేసీఆర్ కిట్లు, కళ్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాలతో పాటు నియోజకవర్గంలో విస్తృత అభివృద్ధి పనులు జరిగాయని గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బీఆర్ఎస్ శ్రేణులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. హామీల అమలును కోరుతూ ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కూసుకుంట్ల సత్తిరెడ్డి, సుర్వి యాదయ్య గౌడ్, అందోజు శంకరాచారి, నర్రీ నరసింహ, జక్కర్తి పాపయ్య, నలపరాజు రమేష్, చిత్రసేనారెడ్డి, రాచకొండ గిరి, పాండురంగ నాయక్, రాజు నాయక్, తరుణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# స్పీకర్ ను అవమానించిన బిఆర్ఎస్ సభ్యులపైఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలి

**మాజీ ఎంపీపీ పుట్టల సునీత కృపయ్య**

ప్రజా వాయిస్ వేములపల్లి
శాసనసభ సమావేశంలో బి ఆర్ ఎస్ పార్టీ శాసనసభ్యులు స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు వారి కుటుంబ సభ్యులపై ఉపయోగించిన పదజాలం సభ్య సమాజం తలదించుకునేలా ఉందని కాంగ్రెస్ పార్టీ మాజీ మండల ఎంపీపీ పుట్టల సునీత కృపయా అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆమె మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితులను దగా చేసిందని అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి ముఖ్యమంత్రిగా దళితుడిని నియమిస్తానని, ప్రతి దళిత కుటుంబానికి మూడెకరాల భూమి ఇస్తానని హామీలు ఇచ్చి దళితుల్ని మోసం చేసిన ఘనత కెసిఆర్ కే దక్కుతుందని ఆమె అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దళిత, బడుగు బలహీన వర్గాల వారికి సముచిత స్థానం కల్పించారని అందులో భాగంగానే దళిత జాతికి చెందిన స్పీకర్ గా గడ్డం ప్రసాద్ కు అవకాశం కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. ఒక దళిత జాతికి చెందిన వ్యక్తి స్పీకర్ గా ఉండడాన్ని జీర్ణించుకోలేని మాజీ ముఖ్యమంత్రి బిఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ అసెంబ్లీ సమావేశాలకు రాకుండా ఫామ్ హౌస్ లో ఉండటం సిగ్గుచేటు అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన శాసనసభ్యులు స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలపై తగు చర్యలు తీసుకోవాలని వారిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి వారి శాసన సభ్యత్వాన్ని వెంటనే తొలగించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. ఆమె వెంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# ప్రజాస్వామ్యమా లేక...రౌడీ రాజ్యమా...!

**కాంగ్రెస్ పార్టీకి పాలన చేతకాకనే దాడులు అంటూ మండిపాటు...**

**మహిళా ఎమ్మెల్యే పై పోలీసుల తీర్పు తప్పు పట్టిన బిఆర్ఎస్ నేతలు**

**ఎనిమిది రోజుల ప్రణాళికలలో అన్నపరెడ్డిపల్లి రోడ్డు నిర్బంధం చేస్తాం**

**దాడులు అరెస్టులు తప్ప ప్రజలకు ఒరిగింది ఏమి లేదు అంటూ వ్యాఖ్య**


**ప్రభుత్వాన్ని ఎండగట్టే దాకా ఉద్యమం ఆగదంటున్నా మెచ్చ నాగేశ్వరరావు**

**రైతుకు మేలు జరపని ప్రభుత్వం ఎందుకు అంటూ మండిపాటు**



ప్రజా వాయిస్ అశ్వారావుపేట
తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ప్రస్తుత పరిస్థితులు రోజురోజుకీ వాడి వేడిగా మారుతున్నాయనే చెప్పుకోవచ్చు ఒకపక్క వెయ్యి రోజుల అభివృద్ధి పనులు వేగవంతం అంటూ అధికార పార్టీ నాయకులు తీవ్రంగా ప్రచారాలు చేస్తూ సభలు ఏర్పాటు చేసి కార్యకర్తలకు గాలిలో దీపం లాంటి మాటలు చెప్తుంటే మరోపక్క ప్రజాపక్ష పార్టీ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు దొరల పాలన ,దోపిడీ పాలన, రాక్షస పాలన అంటూ ప్రచారం చెయ్యడం, కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో చేసింది ఏంటో ప్రజలకు చూపించాలంటూ అసెంబ్లీని ముట్టడించడం సైతం తెలంగాణ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కినంత పని అవుతుంది. ప్రస్తుత నియోజకవర్గంలోని బిఆర్ఎస్ కార్యకర్తలు పలు రకాల నిరసనలు రహదారులు నిర్బంధాలు అధికారులకు వినతి పత్రాలు సమర్పించడానికి వంటి కార్యక్రమాలను వేల సంఖ్య కార్యకర్తలతో విజయవంతంగా పూర్తి చేయడంతో అధికార పార్టీకి పెద్ద తలనొప్పిగా మారింది అంతేకాకుండా ప్రధాన రాష్ట్ర నాయకులు అసెంబ్లీని ముట్టడించటంతో అరెస్టులు నిర్బంధాలు వంటి కార్యక్రమాలు మరింత వేడిని వాతావరణాన్ని పుట్టిస్తున్నాయని చెప్పుకోవచ్చు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం లోని అన్నపురెడ్డిపల్లి పట్టణ నందు శాసనసభ్యులు మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రోడ్డు నిర్బంధ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సందర్భంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రజా పాలన కొనసాగుతుందో లేక రౌడీ రాజ్యం కొనసాగుతుందో ప్రజలు గమనిస్తున్నారని పాలన చేతకాక దాడులు నిర్వహించే సంస్కృతి కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తుందని అసెంబ్లీ ముట్టడించడానికి మాజీ మంత్రివర్యులు మరియు మహిళలు నిరసన ప్రకటిస్తే మహిళలపై పోలీసులు తీరు దురదృష్టకరంగా మారిందని ప్రజాస్వామ్య విధానంలో రక్షణ శాఖ గాడి తప్పి నడుచుకుంటుందని ఎనిమిది రోజుల ప్రణాళికలో బద్దంగా ప్రజలకు పాలన విధివిధానాల గురించి అధికార పార్టీ తెలపాలంటూ నిరసన కార్యక్రమం చేస్తుంటే దాడులు అరెస్టులు చేయడం దురదృష్టకరంగా ఉందని ప్రజలకు వెయ్యి రోజుల పాలల్లో ఒరిగిందంటూ ఏమీ లేదంటూ ప్రభుత్వాన్ని ఎండగట్టే దాకా ఉద్యమం ఆగేది లేదంటూ కార్యకర్తలకు డిసనిర్దేశంలో చెప్పటమే కాకుండా రైతుకు మేలు జరగని ప్రభుత్వం ఎందుకని భారీ స్థాయిలో విమర్శలు లేవనెత్తినారు అంతేకాకుండా ప్రతి మండలాలలో అధికార పార్టీ కార్యకర్తలు కేవలం ప్రజలను మోసం చేస్తూ రాజాధికారం చేతబట్టి లి"నేనే రాజు నేనే మంత్రి"లి అంటూ రాజు మేలుతున్నారే తప్ప ప్రజలకు రవంత మేలు చేసిన సందర్భం లేదని భూభారత పేరుతో ప్రజలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని 24 గంటల కరెంటు నమ్మబలికిన ప్రభుత్వం కేవలం ఎనిమిది గంటల కరెంటు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న సందర్భం కనిపిస్తుందని గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్న రైతన్నకు బోనస్ పేరుతో 500 రూపాయలు వేసి చేతులు దులుపుకున్న ఘనత అధికార పార్టీ కాంగ్రెస్ అంటూ ధ్వజమెత్తారు ఈ కార్యక్రమంలో మండల మాజీ జడ్పిటిసిలు ఎంపీటీసీలు కార్యకర్తలు పాల్గొన్నారు.






# వరి బోనస్ పొందడానికి ఆన్లైన్ నమోదు చేయండి

**మండల వ్యవసాయ అధికారి ఏవో డాకేశ్వర్ గౌడ్**

ప్రజా వాయిస్.. వీపనగండ్ల
వీపనగండ్ల మండల కేంద్రం తో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు పండించిన సన్న రకం ధాన్యాన్ని ఆన్లైన్లో నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ నుండి బోనస్ వస్తుందని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వానాకాలంలో రైతులు పండిస్తున్న సన్నరకం దాన్యం ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని అదేవిధంగా ప్రభుత్వం కేటాయించిన సన్న రకం ధాన్యానికి బోనస్ వస్తుందని తెలిపారు. అదేవిధంగా ఫర్టిలైజర్ షాప్ లో కొనుగోలు చేయకుండా స్వంతంగా పంట పండించిన రైతులు సొంతంగా ప్రకటించిన లేఖపత్రంను ఏఈఓ అధికారికి ఇవ్వాలని అన్నారు. రైతులు ఆలస్యం చేయకుండా ప్రభుత్వం ఇస్తున్న సన్న రకం ధాన్యానికి బోనస్ కోసం వెంటనే ఆన్లైన్ నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్ అన్నారు.

# కాంగ్రెస్ మోసపూరిత పాలనపై ఉరిమిపడ్డ గులాబీ దళం!

**- వంద రోజుల హామీలు ఏమైనట్టు?.. కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డ బాల్క సుమన్, కోరుకంటి చందర్**

**- కేసీఆర్ హయాంలోనే విద్యారంగానికి స్వర్ణయుగం**



ప్రజా వాయిస్ గోదావరిఖని
ఎన్నికల హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైందని మాజీ ఎంపీ బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం గోదావరిఖనిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం నుండి ప్రధాన చౌరస్తా వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా విద్యార్థులకు రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డులు, యువతులకు స్కూటీలు, రూ. 4,000 నిరుద్యోగ భృతి మరియు ఏటా 2 లక్షల ఉద్యోగాల హామీలను నెరవేర్చలేదని మండిపడ్డారు. రూ. 12,000 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే జీవో 97 ద్వారా పాలటెక్నిక్ కాలేజీలకు చెందిన 1200 ఎకరాల విలువైన భూములను అమ్మేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు.?అనంతరం కోరుకంటి చందర్ మాట్లాడుతూ, కేసీఆర్ హయాంలో ఉచిత విద్య, గురుకులాలతో విద్యా రంగానికి స్వర్ణయుగం ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ వ్యవస్థను నాశనం చేస్తోందని విమర్శించారు. వంద రోజుల్లో హామీలు నెరవేరుస్తామని చెప్పి ప్రజలను మోసం చేసిన ఈ ప్రభుత్వానికి విద్యార్థులు, నిరుద్యోగులు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌశిక హరి, మూల విజయ రెడ్డి, హరీష్ రెడ్డి, మేకల సమ్మన్న యాదవ్ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు

**- రాష్ట్రంలో రాచరిక పాలన కొనసాగుతోంది**

**- మహిళా శాసన సభ్యుల చీరలు లాగడం సిగ్గుచేటు**

**- 161వ జాతీయ రహదారిపై మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ధర్నా... అరెస్ట్...**

**- ధర్నా వార్తను కవర్ చేస్తున్న జర్నలిస్ట్ పైకి పోలీసు వాహనాన్ని ఎక్కించిన వైన్యం**

**- పరిస్థితి ఉద్రిక్తం**



ప్రజా వాయిస్,సంగారెడ్డి :
శాసనసభ సమావేశాలు ప్రారంభం కావడంతో టిఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు నల్ల దుస్తులు ధరించుకొని నిరసన తెలుపుతూ అసెంబ్లీకి వెళుతుండగా పోలీసులు అడ్డుకొని మహిళా శాసనసభ్యులకు సంబంధించిన చీరలను పట్టుకొని లాగడం సభ్య సమాజానికి సిగ్గుచేటని అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ అన్నారు. పోలీసుల తీరును నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా అందోల్ నియోజకవర్గంలోని అల్లాదుర్గం వద్ద 161 జాతీయ రహదారిపై పార్టీ శ్రేణులతో కలిసి ధర్నాకు దిగారు. దీంతో అల్లాదుర్గం సీఐ రేణుక జాతీయ రహదారిపై ధర్నా చేయడానికి అనుమతులు లేవని... ఇటు నుంచి వెళ్లిపోవాలంటూ పట్టు పట్టారు. దీంతో మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఎక్కడైనా ఉంటుందని... మహిళను అవమానించిన వారిపై చర్యలు తీసుకునే వరకు ఆందోళన కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ బలవంతంగా పోలీసు వాహనంలోకి ఎక్కించి తరలిస్తుండగా ఫోటో తీసి ఎందుకు వెళ్లిన సాక్షి జర్నలిస్టు రవీందర్ పోలీస్ వాహనం కింద పడిపోయాడు. పోలీస్ డ్రైవర్ దీని గమనించకుండానే వాహనాన్ని ముందుకు తీయడంతో అతని వెన్నుబొక్కలతోపాటు పక్క బొక్కలు సైతం విరిగినట్లు విశ్వాసనీయంగా తెలిసింది. దీంతో పోలీసులు అతన్ని హుటాగొట్టిన జోగిపేట, సంగారెడ్డి కాకుండా నేరుగా హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఎందుకంటే గాయపడిన జనరల్ ఇస్తున్న జోగిపేట గాని సంగారెడ్డికి తరలించిన జర్నలిస్టులో తిరగబడే అవకాశం ఉందని గుర్తించిన పోలీసులు నేరుగా హైదరాబాద్ కు తరలించారు. ప్రస్తుతం ఆయన నేమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఈ సంఘటనకు పోలీసులు అతి ఉత్సాహం చూపడమే ప్రధాన కారణమని బిఆర్ఎస్ పార్టీ స్థానికులతో పాటు స్థానికులు ఆరోపిస్తున్నారు . అంతకుముందు వట్టిపల్లిలో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు నాయకులు పాల్గొన్నారు.

# ఆరుగొండ విండో చైర్మన్ గా బండారు శ్రీనివాస్ రెడ్డి



ప్రజా వాయిస్ తాడ్వాయి/
తాడవాయి మండలం ఆరుగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులుగా బండారు శ్రీనివాస్ రెడ్డిని నియమించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కృషి మేరకు శ్రీనివాస్ రెడ్డికి ఆరుగొండ సింగిల్ విండో చైర్మన్ పదవి దక్కింది. శ్రీనివాస్ రెడ్డి సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గుండారం ఎల్లారెడ్డిపల్లి ఎంపీటీసీగా గతంలో పనిచేశారు. తాను విండో చైర్మన్ బాధ్యతలు చేపట్టిన అనంతరం గుండారం ఎల్లారెడ్డిపల్లి గ్రామాల మధ్య సొసైటీ గోదాం నిర్మిస్తానని రైతులకు స్పష్టం చేశారు. గతంలో ఎంపీటీసీగా పనిచేసినప్పుడు గుండారం మెదక్ ల మధ్య పెద్దవాగుపై ఎల్లాపూర్ తండాలో రెండు కోట్ల రూపాయలతో పెద్ద బ్రిడ్జి నిర్మించానని అరగొండ విండో చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి గుర్తు చేశారు. ఎన్ని ఆఫర్లు వచ్చిన కాంగ్రెస్ పార్టీ వీడకుండా పార్టీ బలోపేతానికి కృషి చేశానన్నారు. తాను అరగొండ చైర్మన్ కావడానికి మద్దతునిచ్చిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్, తాడ్వాయి మండల పార్టీ నాయకులకు రైతులకు కృతజ్ఞతలు తెలిపారు.

## దళిత స్పీకర్‌ను కించపరిచిన తాత మధు, నవీన్ రెడ్డిలను సస్పెండ్ చేయాలి

### కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నాగరాజ్ గౌడ్



ప్రజావాయిస్ బీబీపేట్, ఆగస్టు 07,
దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ ను కించపరిచిన బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాత మధు, నవీన్ రెడ్డిలను సస్పెండ్ చేయాలని కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ డిమాండ్ చేశారు.సభ్య సమాజం తలదించుకునేలా ఉన్న ఈ వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు, శాసన వ్యవస్థ గౌరవానికి విరుద్ధమన్నారు. ప్రజాస్వామ్యంలో శాసనసభ స్పీకర్ పదవి అత్యంత గౌరవప్రదమైనదని, ఆ పదవిలో ఉన్న వ్యక్తిపై కులపరమైన లేదా అవమానకర వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరం అన్నారు.బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎమ్మెల్సీలు తాత మధు, నవీన్ రెడ్డిలు అభ్యంతర వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. తీవ్రంగా పరిగణించి, శాసన మండలి నిబంధనల ప్రకారం వారిద్దరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలకు స్థానం ఉన్నప్పటికీ, వ్యక్తిగత అవమానాలు, కుల వివక్షకు తావులేదన్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.



## డీజే నిర్వాహకుల బైండోవర్

ప్రజా వాయిస్, /లక్షెట్టిపేట
మంచిర్యాల జిల్లా కేంద్రంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లక్షెట్టిపేటకు చెందిన పలువురు డిజే నిర్వాహకులను తాసిల్దార్ ముందు బైండోవర్ చేయడం జరిగిందని ఎస్ ఐ గోపతి సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణేష్ నవరాత్రుల సందర్భంగా వినాయక మండపాల వద్ద ఎలాంటి డీజేలకు అనుమతి లేదని శోభాయాత్రలో కూడా డీజేలు పెట్టకూడదని భక్తి శ్రద్ధలతో శాంతియుత వాతావరణం లో గణేష్ పండుగను జరుపుకోవాలని పోలీసులు సూచించారు. గణేష్ మండప నిర్వాహకులు పోలీస్ పోర్టల్ లో పూర్తి వివరాలు పొందుపరచాలన్నారు. మండపాల వద్ద సినిమా పాటలు పెట్టడం, జూదం ఆడటం లాంటివి చేయకూడదని ముఖ్యంగా భారీ సౌండ్ వచ్చే బాక్స్ ఎట్టి పరిస్థితుల్లో పెట్టకూడదని పోలీసులు సూచించారు.డీజే నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘించి డీజేలు పెట్టిన శోభాయాత్రలు డీజెలు పెట్టిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## సీసీ రోడ్డుతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం



ప్రజా వాయిస్ సిద్దిపేట /దౌల్తాబాద్,
గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని సర్పంచ్ రాజాగారి రేణుక రాజాగౌడ్ అన్నారు. రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలో రూ. 15 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ గ్రామంలో రహదారుల అభివృద్ధితో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో రోడ్లపై బురద, గుంతల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులకు రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు.గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని సర్పంచ్ తెలిపారు. చేపడుతున్న సీసీ రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయడంతో పాటు నిర్ణీత సమయంలోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో మిగిలిన మౌలిక వసతుల సమస్యలను కూడా దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కరుణాకర్, గుట్ట, నాయకులు సుధాకర్, నర్సింలు, శివ, ఆంజనేయులు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్’పై అనుచిత వ్యాఖ్యలకు నిరసన

### ములుగు జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నాయకుల ధర్నా

ప్రజా వాయిస్ ములుగు జిల్లా:/
అసెంబ్లీ సమావేశాల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్’పై, ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ములుగు జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆదేశాల మేరకు ములుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముశినేపల్లి కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో..... జాతీయ రహదారిపై నిరసన చేపట్టారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.

**“స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు:”**
**భానోత్ రవిచందర్.**
**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్.**
జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ మాట్లాడుతూ అసెంబ్లీ స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలని అన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్సీ తాత మధు చేసిన వ్యాఖ్యలు అనుచితంగా ఉన్నాయని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

**“ప్రజా సమస్యలపై చర్చించకుండా రాజకీయ అలజడి ఎందుకు?”**
**చింతనిప్పుల బిక్షపతి:**
జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చింతనిప్పుల బిక్షపతి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు,



అభివృద్ధి అంశాలపై చర్చించాల్సిన ప్రతిపక్ష నాయకులు వాటిని పక్కనపెట్టి రాజకీయ విమర్శలకు పరిమితం అవుతున్నారని విమర్శించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను మానుకోవాలని సూచించారు.

**“అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడాలి”:**
ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. అసెంబ్లీకి దూరంగా ఉంటూ బయట నుంచి విమర్శలు చేయడం వల్ల ప్రజలకు ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు.

**“దళిత స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వాలి”:**
దళిత వర్గానికి చెందిన వ్యక్తి స్పీకర్‌గా ఉన్న సమయంలో ఆయన పదవిని గౌరవించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. గతంలో దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడు ఎకరాల భూమి వంటి పలు హామీలు ఇచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాలని సూచించారు.ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్, బొమ్మకంటి రమేష్ వర్మ, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్, ఆత్మ కమిటీ జిల్లా డైరెక్టర్ జక్కుల రేవంత్ యాదవ్, జిల్లా ప్రచార కార్యదర్శి నూనెటి శ్యామ్, ములుగు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లావుడ్య రమేష్, ములుగు మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టేవాడ తిరుపతి, ములుగు మండల యువజన అధ్యక్షుడు బండి మధు, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు హాజీ పాషా, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, యువజన నాయకులు, ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, చైర్మన్లు, డైరెక్టర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ భగ్గుమంది!

### ఏటూరునాగారంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం.!
### 420 హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేశారు.
### కాకులమర్రి లక్ష్మణ్ బాబు.జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు.
### ప్రతిపక్ష నేతలను అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం
### ప్రజా సమస్యలు పరిష్కరించాలి.. ఎన్నికల హామీలు అమలు చేయాలి.
### బీఆర్ఎస్ పార్టీ డిమాండ్

ప్రజా వాయిస్ ములుగు జిల్లా; ఏటూరునాగారం మండలం:/
కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏటూరునాగారంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

“420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు.”
ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం,



వెయ్యి రోజుల పాలన పూర్తవుతున్నా వాటిని అమలు చేయలేదని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**“ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అరెస్టులా?”**
శాసనసభలో ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడాన్ని లక్ష్మణ్ బాబు ఖండించారు. ప్రభుత్వ వైఫల్యాలు అసెంబ్లీలో బయటపడతాయనే భయంతోనే ప్రతిపక్ష నాయకులను అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు.

**“అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చకు అవకాశం ఇవ్వాలి”**
ప్రతిపక్ష నాయకులు ప్రజా సమస్యలను శాసనసభలో ప్రస్తావించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ప్రతిపక్ష గొంతును అణచివేయకుండా ప్రజా సమస్యలపై చర్చకు ప్రభుత్వం అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తే మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, తుమ్మ మల్లారెడ్డి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు కూనూరు అశోక్ గౌడ్, కాకులమర్రి ప్రదీప్ రావు, జిల్లా నాయకులు పోరిక గోవింద నాయక్, తాటి కృష్ణయ్య, భూక్య జంపన్న, ఎండి వలీ బాబా, తాదూరి రఘు, సర్పిడి రామ్ నర్సయ్య, కర్ర రవీందర్, సయ్యద్ సర్దార్ పాషా, బుల్లెట్ ఓదెలు, తాడ్వాయి మాజీ అధ్యక్షుడు దండుగల మల్లయ్య, కుమ్మరి చంద్రబాబు, కాటాపురం సర్పంచ్ మోహన్, మాదరి చంద్రమౌళి, మాజీ ఎంపీపీ తురం పద్మ, బడిక రమేష్, చిట్టి మల్ల సమ్మయ్య, తాడ్వాయి సర్పంచ్ శిరీష, జాడి బోజారావు, ఉపసర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, యలవర్తి శ్రీనివాస్, దొడ్డ కృష్ణ, కావిరి చిన్నికృష్ణ, వావిలాల పోశయ్య, వావిలాల ముత్తయ్య, వావిలాల రాంబాబు, కటుకూరి రాఖీ, యశ్వంత్, మెరుగు వెంకటేశ్వర్లు, యలవర్తి శ్రీనివాస్, బాడిష నాగరమేష్, పాలకుర్తి శ్రీనివాస్, చంద లక్ష్మీనారాయణ, వావిలాల కిషోర్, బట్టు రమేష్, కొండాయి చిన్ని, గంప కిరణ్, ఏంపెల్లి రాజు, పెద్దబోయిన బాలకృష్ణ, బట్టు గోపి, ఎస్కే బాబా, తాడ్వాయి ఉపసర్పంచ్ నవీన్, మాదరి రాంబాబు, తాళ్లపెల్లి మోహన్, కమలమ్మ, సంగం లక్ష్మి, బండి లక్ష్మి, మహేశ్వరి, భానుమతి, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమంలో అధికారుల ఫోన్ వినియోగంపై విమర్శలు!

### ప్రజల సమస్యలు వినాల్సిన సమయంలో అధికారుల తీరుపై అసంతృప్తి

బాసర: ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి పరిష్కారం చూపించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో కొంతమంది అధికారులు తగినంత శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఇటీవల మండల స్థాయిలో కూడా ఏర్పాటు చేయడంతో, ప్రజలు తమ సమస్యలను స్థానికంగానే అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం కలిగింది. అయితే బాసర మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కొంతమంది అధికారులు సెల్‌ఫోన్లను వినియోగిస్తూ కనిపించడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. పై అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అందించే ఆదేశాలు, సూచనలు వినాల్సిన సమయంలోనూ, వివిధ గ్రామాల నుంచి తమ సమస్యలను చెప్పుకునేందుకు వచ్చిన ప్రజలతో మాట్లాడాల్సిన సమయంలోనూ ఫోన్ వినియోగం కనిపించిందని వారు పేర్కొన్నారు.ప్రజల సమస్యలను ఆలకించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కార్యక్రమంలో పూర్తి శ్రద్ధ చూపాలని పలువురు కోరుతున్నారు. అయితే అధికారుల ఫోన్ వినియోగానికి సంబంధించి వారి వివరణ తెలుసుకోవాల్సి ఉందని, అది అధికారిక పనిలో భాగమై ఉండే అవకాశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని మరికొందరు సూచిస్తున్నారు.ప్రజావాణి అనేది ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహించే ముఖ్యమైన కార్యక్రమమని, అలాంటి కార్యక్రమంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.కాగా, ప్రజావాణి కార్యక్రమం జరుగుతున్న సమయంలో అధికారుల సెల్‌ఫోన్ వినియోగంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం జరిగినట్లు నిర్ధారణ అయితే తగిన



సూచనలు ఇవ్వడంతో పాటు అవసరమైతే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ అంశంపై సంబంధిత అధికారుల వివరణ వెలువడాల్సి ఉంది.ప్రజల సమస్యలకు వేదికగా నిలిచే ప్రజావాణి కార్యక్రమంలో అధికారులు పూర్తి శ్రద్ధతో పాల్గొనాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**- ప్రజావాయిస్ బాసర**

## సిద్దిపేట ప్రభుత్వ హాస్పిటల్ లో ల్యాబ్ టెక్నీషియన్ మృతి

### సమగ్ర దర్యాప్తు జరపాలి: కలెక్టర్‌కు బీఎల్పీ వినతి

ప్రజా వాయిస్: సిద్దిపేట
సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ పవన్ ఆత్మహత్యపై సమగ్ర దర్యాప్తు జరపాలని, అలాగే ఆసుపత్రి నుంచి తొలగించిన ల్యాబ్ టెక్నీషియన్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని బహుజన లెఫ్ట్ పార్టీ (దీప్రా) సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తలారి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిద్దిపేట గౌరవ కలెక్టర్‌కు పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా తలారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులలో తీవ్ర అభద్రతాభావం నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. సురక్ష ఏజెన్సీ కాంట్రాక్టర్ చల్ల శ్రీనివాసరెడ్డి, సూపర్వైజర్ బండి రమేష్‌లు శానిటేషన్ ఉద్యోగినిపై జరిపిన లైంగిక దాడి ఘటనను మరవకముందే.. ల్యాబ్ టెక్నీషియన్ పవన్ సూసైడ్ చేసుకోవడం అత్యంత బాధాకరమన్నారు.పది, పదిహేనేళ్లుగా పనిచేస్తున్నా ఉద్యోగులకు భద్రత లేదని, నెలల తరబడి జీతాలు రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం వీరి సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

**బీఎల్పీ ప్రధాన డిమాండ్లు**
ల్యాబ్ టెక్నీషియన్ పవన్ మృతిపై పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ జరపాలి.
కాంట్రాక్టర్ చల్ల శ్రీనివాసరెడ్డి అక్రమాలపై దర్యాప్తు చేసి, సదరు ఏజెన్సీ కాంట్రాక్టును రద్దు చేయాలి.
ఆసుపత్రి నుండి అక్రమంగా తొలగించిన ల్యాబ్ టెక్నీషియన్లందరినీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలి.
హాస్పిటల్ సూపరింటెండెంట్ పనితీరుపై పలు అనుమానాలు ఉన్నందున, వారిపై కూడా విచారణ జరపాలి.ఈ కార్యక్రమంలో బీఎల్పీ నాయకులు దబ్బేట ఆనంద్, దబ్బేట భగవాన్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

**మండపాల నిర్వాహకులు నిబంధనలు తప్పక పాటించాలి**

**పాలకుర్తిలో శాంతి కమిటీ సమావేశం.. డీజే లకు అనుమతి లేదని స్పష్టం చేసిన సీఐ భరత్ సుమన్**

**ప్రజా వాయిస్/పాలకుర్తి/సెప్టెంబర్ 07**

జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోగణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు, సభ్యులు, డీజే ఆపరేటర్లతో పాలకుర్తి పోలీసుల ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. సీఐ భరత్ సుమన్, ఎస్ఐ డి.పవన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సుమారు 50 మంది గణేష్ మండపాల నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గణేష్ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. ప్రతి గణేష్ మండపాన్ని నిర్దేశిత విధానంలో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, మండపం ఏర్పాటుకు సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందాలని స్పష్టం చేశారు.మండపాల వద్ద కనీసం ముగ్గురు నిర్వాహకులు 24 గంటలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. విద్యుత్, అగ్నిమాపక భద్రతతో పాటు తగిన లైటింగ్, భక్తుల రక్షణకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గణేష్ ఊరేగింపు, నిమజ్జనం సమయంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా పోలీసులకు సహకరించాలని, రిజిస్ట్రేషన్ సమయంలోనే నిమజ్జనం తేదీ, ప్రదేశం వివరాలను నమోదు చేయాలని సూచించారు. డీజేలకు అనుమతి లేదని నిర్వాహకులు, డీజే ఆపరేటర్లు పోలీసుల ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు స్పష్టం చేశారు.ఊరేగింపు సమయంలో చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజల మధ్య వివాదాలు, మత విద్వేషాలకు దారితీసే నినాదాలు, ప్రసంగాలు లేదా కార్యక్రమాలు నిర్వహించరాదని హెచ్చరించారు.గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, సోదరభావంతో నిర్వహిస్తూ పోలీసుల సూచనలు, నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని పాలకుర్తి పోలీసులు విజ్ఞప్తి చేశారు. మండపాల నిర్వాహకులు, డీజే ఆపరేటర్లు, భక్తులు పోలీసులకు పూర్తిగా సహకరించి ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించాలని కోరారు.





# సుల్తాన్‌పల్లిలో అభివృద్ధికి కొత్త అడుగు

**రూ.కోటి వ్యయంతో సీసీ రోడ్లు,డ్రైనేజీ పనులు**

**ఎమ్మెల్యే సహకారంతో ప్రారంభం**

**ప్రజా వాయిస్/శంషాబాద్:**

సుల్తాన్‌పల్లి గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి పనులు ప్రారంభమయ్యాయి.కేబీ దొడ్డి ప్రాంతంలో సుమారు రూ.కోటి అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు,డ్రైనేజీ నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ ఎల్గని ప్రభాకర్‌గౌడ్ శ్రీకారం చుట్టారు.రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సహకారంతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు.గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, పారిశుద్ధ్య సమస్యలను తగ్గించడం,ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ పేర్కొన్నారు.పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దండు ఇస్తారి,ఉప సర్పంచ్ దండు శివకుమార్,వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# మైదానంలో హోరాహోరీ పోరు

**అట్టహాసంగా మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడోత్సవాలు ప్రారంభం**

**విజయం కంటే క్రీడా స్ఫూర్తే ముఖ్యం.. ప్రతిభను చాటాలి: దొంత సుధాకర్ మార్కెట్ కమిటీ చైర్మన్**

**ప్రజా వాయిస్ సైదాపూర్ :-**

మండల కేంద్రంలోని వెన్కేపల్లి-సైదాపూర్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడోత్సవాలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థుల కేరింతలు, క్రీడా ఉత్సాహంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది.క్రీడోత్సవాలను మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్ ప్రారంభించి మాట్లాడుతూ, క్రీడలు విద్యార్థులకు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని అన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు.తహశీల్దార్ గుర్రం శ్రీనివాస్గౌడ్, ఎంపీడీవో యాదగిరి మాట్లాడుతూ, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిలో క్రీడలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల, జట్టుగా పనిచేసే లక్షణాలను క్రీడలు పెంపొందిస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు.మండల విద్యాధికారి కట్టా రవీంద్ర చారి మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.మండల ఎస్ జి ఎఫ్ సెక్రటరీ జ్యోతి, క్రీడా పోటీలను నిర్వహించగా ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మునిపాల సునీత రవి, పాఠశాల



ప్రధానోపాధ్యాయులు పెరుగు దేవేందర్ రెడ్డి, ఏఎస్ఐ సంపత్ రెడ్డి రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటరెడ్డి వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతిమ, కృష్ణవేణి, శిరీష, అపర్ణ మరియు ఉపాధ్యాయులు హనుమాన్ల భాస్కర్, అజయ్ సిఆర్పి రమేష్, తదితరులు, అన్ని ఉన్నత పాఠశాలల నుండి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం

**ప్రజా వాయిస్ దుబ్బాక/ దౌల్తాబాద్, సెప్టెంబరు 7:**

ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఎంతో అండగా నిలుస్తోందని సర్పంచ్ పంజ స్వామి అన్నారు. ఎమ్మెల్సీ యాదవ రెడ్డి సహకారంతో దౌల్తాబాద్ మండలం గాజులపల్లి గ్రామానికి చెందిన మారుపాక కల్పనకు రూ. 16,500, పంజ సత్యనారాయణకు రూ. 20,500 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పేద కుటుంబాల్లో అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వైద్య ఖర్చులు భారంగా మారుతున్నాయని, అలాంటి సమయంలో సీఎంఆర్ఎఫ్ ఆర్థికంగా ఎంతో భరోసా కల్పిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎంఆర్ఎఫ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు.గ్రామంలో ప్రజలకు అవసరమైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని సర్పంచ్ పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందడంతో లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాశం యేసు, తోట నరేష్, దాసరి బిక్షపతి, పోతుగంటి మల్లారెడ్డి, పోతుగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పన్నులు వసూలు – సేవలు మాత్రం శూన్యం.!

**నాలుగేళ్లుగా సమస్యలే సమస్యలు**

**కిస్మత్‌పూర్‌లో అధికారుల తీరుపై**

**బిఆర్ఎస్ నేత నవీన్‌కుమార్ ముదిరాజ్ ఆగ్రహం**

**ప్రజా వాయిస్/ రాజేంద్రనగర్:**

పన్నులు మాత్రం ఠంచన్‌గా వసూలు చేస్తున్న జీహెచ్ఎంసీ, ప్రజలకు కనీస మున్సిపల్ సదుపాయాలు కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తోందని బీఆర్ఎస్ 122 డివిజన్ సీనియర్ నాయకుడు ఎం. నవీన్‌కుమార్ ముదిరాజ్ మండిపడ్డారు.కిస్మత్‌పూర్ 121,122,123 డివిజన్లలో పారిశుద్ధ్యం,వీధి దీపాలు, మున్సిపల్ సేవలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆరోపించారు.కిస్మత్‌పూర్ సర్కిల్ కార్యాలయంలో సరిపడా పారిశుద్ధ్య సిబ్బంది లేకపోవడంతో పాటు డోజర్,జేసీబీ వంటి యంత్రాలు కూడా అందుబాటులో లేవన్నారు. నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా అధికారులకు సమస్య కనిపించకపోవడం విడ్డూరమని విమర్శించారు. కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా అందుబాటులో లేకపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోందన్నారు. దోమల బెడద పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నా అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు.పనిచేయని వీధి దీపాలతో రాత్రివేళ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.పన్నులు,అడ్వాన్స్ ట్యాక్స్‌లు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ ప్రజలకు సేవలు అందించడంలో ఎందుకు లేదని నవీన్‌కుమార్ ప్రశ్నించారు.ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో కార్యాలయాల్లో సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. అనుమతుల కోసం దరఖాస్తు చేసి,ఫీజులు చెల్లించినా నెలల తరబడి ప్రొసీడింగ్స్ ఇవ్వకపోవడం అధికారుల పనితీరుకు నిదర్శనమని విమర్శించారు.ఇప్పటికైనా అధికారులు కళ్లుతెరిచి కిస్మత్‌పూర్ సర్కిల్‌కు అవసరమైన సిబ్బంది, యంత్రాలు సమకూర్చి పారిశుద్ధ్యం,వీధి దీపాలు, అనుమతుల సమస్యలను పరిష్కరించాలని నవీన్‌కుమార్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల తరఫున ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.



# మైసమ్మ గుడి హుండీ చోరీకి యత్నం.. ఇద్దరు నిందితులు అరెస్ట్

**సింగరేణి ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో ఘటన**

**తాళాలు పగలగొట్టి హుండీతో పరారయ్యే ప్రయత్నం**

**అప్రమత్తమైన సెక్యూరిటీ గార్డు, ఆస్పత్రి సిబ్బంది పట్టివేత**




**ప్రజా వాయిస బెల్లంపల్లి టౌన్**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని సింగరేణి ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న మైసమ్మ గుడిలో హుండీని దొంగిలించ దానికి ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను బెల్లంపల్లి 1 టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సెప్టెంబర్ 6వ తేదీ ఉదయం సుమారు 9.30 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు మైసమ్మ గుడి తాళాలను పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. అనంతరం గుడిలో ఉన్న హుండీని దొంగిలించి అక్కడి నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించ గా ఆస్పత్రి వద్ద సెక్యూరిటీ గార్డు విధులు నిర్వహిస్తున్న చింతం మొగిలి గమనించి అప్రమత్తమయ్యారు. వెంటనే ఇద్దరు వ్యక్తులను పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. హుండీలో సుమారు రూ.2 వేల వరకు నగదు ఉన్నట్లు సమాచారం. సెక్యూరిటీ గార్డు చింతం మొగిలి ఫిర్యాదు మేరకు బెల్లంపల్లి 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ ఘటనలో మడక చిరంజీవి అలియాస్ నరసయ్య (42), కుంటాల భీమయ్య (51)లను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మొదటి నిందితుడిపై గతంలో సుమారు 60 కేసులు, రెండో నిందితుడిపై సుమారు 8 కేసులు వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదై ఉన్నాయి.ఇద్దరు నిందితులపై క్రైమ్ నంబర్ 146/2026, సెక్షన్ 303(2) రెడ్ విత్ 62 బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన అనంతరం గౌరవ న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు బెల్లంపల్లి 1 టౌన్ ఎస్ హెచ్ ఓ కె. శ్రీనివాసరావు తెలిపారు.

# మహిళా ఎమ్మెల్యేల పట్ల రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు హేయం

**అంబేద్కర్ సాక్షిగా మహిళా లోకం ఆవేదన..**

**అంబేద్కర్ విగ్రహానికి మహిళా కౌన్సిలర్ వినతిపత్రం సమర్పణ..**

**నల్ల కండువాలతో బిఆర్ఎస్ మహిళ కౌన్సిలర్ల వినూత్న నిరసన..**

**రేవంత్ ప్రభుత్వ తీరుపై మహిళా కౌన్సిలర్లు నిరసన వ్యక్తం..**

**ప్రజా వాయిస్ జహీరాబాద్:**

తెలంగాణలో మహిళా ప్రజాప్రతినిధులపై జరిగిన అవమానాలు, నెరవేరని సంక్షేమ హామీలపై జహీరాబాద్ లో సోమవారం స్థానిక మహిళా ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా నలుపు రంగు కండువాలు ధరించి పట్టణంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి తమ గోడును వెళ్లబోసుకున్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతోందని నాయకురాలు ఆరోపించారు. ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా అమలు చేయకుండా మోసం చేశారని మండిపడ్డారు.ఇచ్చిన హామీలను అమలు చేయాలని అసెంబ్లీ వేదికగా ప్రజాస్వామ్యబద్ధంగా నిలదీసిన సీనియర్ మహిళా ప్రజాప్రతినిధులు సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి తదితరుల పట్ల ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ప్రాంగణంలో మహిళా నాయకురాళ్ల ఆత్మగౌరవం దెబ్బతినేలా, చీరలు చిరిగిపోయేలా వ్యవహరించడం అత్యంత హేయమని ధ్వజమెత్తారు. అత్యున్నత చట్టసభ వద్దే మహిళా ప్రతినిధులకు రక్షణ లేకపోతే, రాష్ట్రంలోని సాధారణ మహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.నల్ల కండువాలతో నిరసన తెలుపుతూ, మహిళల



ఆత్మగౌరవాన్ని కాపాడేలా, ఎన్నికల హామీలను తక్షణమే నెరవేర్చేలా ప్రభుత్వానికి రాజ్యాంగ స్ఫూర్తితో సద్బుద్ధిని ప్రసాదించాలని అంబేద్కర్ విగ్రహం ఎదుట వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో నామ స్రవంతి, పర్వీన్ బేగం, పర్వీన్ మజ్జిగ సుజిత, అన్నపూర్ణ శేరి, స్వప్న ప్రమీల, పెద్దబాయి మైపాల్, గౌసుద్దీన్ గౌరీ, జాకీర్, దీపక్ నామ రవికిరణ్ , అబ్దుల్లా,యాకుబ్ , ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు..



## హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ ధర్నా

**ప్రజా వాయిస్, మెట్‌పల్లి:**
ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు, 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మెట్‌పల్లి పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించి, ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. అలాగే హైదరాబాద్‌లో మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారుసాయిరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖర్ రావు, ఆకుల ప్రవీణ్, మొరపు తేజ, పురుషోత్తం, జియా, విష్ణు, రాజా గౌడ్, తిరుపతిరెడ్డి, కొండ్లేపు శ్యామ్, సుధాకర్ గౌడ్, శ్రీనివాస్, ప్రణయ్, హరీష్, సత్యం, హనుమాన్లు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ శ్రేణుల నిరసన

### అసెంబ్లీలో ఎమ్మెల్యేలపై దాడి అప్రజాస్వామికం..

### మండిపడిన బీఆర్ఎస్ నేతలు!

**ప్రజా వాయిస్, / లక్షెట్టిపేట**
అసెంబ్లీ వద్ద బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలపై, మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు చేసిన దాడిని నిరసనగా సోమవారం పట్టణంలోని స్థానిక గాంధీ చౌక్ వద్ద రోడ్డుపై బైఠాయించి బిఆర్ఎస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు.అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీఓ కి ఆరు గ్యారెంటీలు,420 హామీలు అమలు చేయాలని ప్రజావాణిలో వినతి పత్రం అందించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ కేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షులు చుంచు చిన్నయ్య, కౌన్సిలర్లు పెట్టం తిరుపతి, ఎగ్గడి జమున కుమార్, గడిగొప్పల సతీష్, ఆసాడి పురుషోత్తం, మోట పలుకుల శ్రీనివాస్, గరిసే రవీందర్,గొల్ల మనోహర్, అంకతి గంగాధర్, దండేపల్లి మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ అనిల్, దండేపల్లి, లక్షెటిపేట కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఛలో ఇందిరా పార్క్‌కు బయలుదేరిన బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కిషన్ నాయక్ అరెస్టు




**ప్రజా వాయిస్/యాదాద్రి**
విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాకు బయలుదేరిన యాదాద్రి భువనగిరి జిల్లా బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కిషన్ నాయక్‌ను యాదగిరిగుట్ట పోలీసులు సోమవారం ఉదయం ముందస్తుగా అరెస్టు చేశారు.ఈ సందర్భంగా కిషన్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. విద్యార్థులకు సంబంధించిన సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని, రాష్ట్రంలోని సుమారు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల న్యాయమైన హక్కుల కోసం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నేతృత్వంలో నిర్వహించనున్న మహాధర్నాను అడ్డుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు అరెస్టులకు పాల్పడుతోందని కిషన్ నాయక్ విమర్శించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న వారిని అరెస్టులతో అణచివేయాలని చూడటం సరికాదన్నారు.అరెస్టులు, నిర్బంధాలతో విద్యార్థుల సమస్యలపై జరుగుతున్న పోరాటాన్ని అడ్డుకోలేరని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై విద్యార్థులు, ప్రజలు రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని కిషన్ నాయక్ హెచ్చరించారు.

## అరెస్టులు కాదు.. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వండి

### బీజేపీ నేతల ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

### బిజెపి మండల అధ్యక్షుడు మారం రవికుమార్



**ప్రజా వాయిస్/పాలకుర్తి/సెప్టెంబర్ 07**
తెలంగాణలో విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన 'ఛలో అసెంబ్లీ' కార్యక్రమానికి వెళ్లకుండా పాలకుర్తి మండల బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడాన్ని మండల అధ్యక్షుడు మారం రవికుమార్ తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు 40 వేల మంది విద్యార్థులకు సంబంధించిన సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.బీజేపీ నాయకులను అరెస్టు చేయడంపై పెట్టిన శ్రద్ధను విద్యార్థుల ఫీజు బకాయిల చెల్లింపుపై పెడితే బాగుంటుందని అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం సరికాదని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు దొంగరి మహేందర్, కమ్మగాని శ్రీకాంత్ గౌడ్ మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల దేవరాజు బీజేవైఎం మండల అధ్యక్షుడు గొనె అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నకోడూర్ మండలంలో కాంగ్రెస్‌కు పెరుగుతున్న ప్రజాదరణ

### మల్లారానికి చెందిన శ్రీనివాస్ చారి చేరిక



**ప్రజా వాయిస్, సిద్దిపేట /చిన్నకోడూర్:**
చిన్నకోడూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకూ ప్రజా ఆదరణ పెరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వ సిద్ధాంతాలు, చేపడుతున్న సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన శ్రీనివాస్ చారి కాంగ్రెస్ పార్టీలో చేరారు. చిన్నకోడూర్ మండల ఏఎంసీ వైస్ చైర్మన్ బుస్స రాజశేఖర్ ఆధ్వర్యంలో ఈ చేరిక కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బుస్స రాజశేఖర్ శ్రీనివాస్ చారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.అనంతరం బుస్స రాజశేఖర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రజలు పెద్ద ఎత్తున పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. మల్లారం గ్రామంలో కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. శ్రీనివాస్ చారి చేరిక పార్టీకి మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందని, రానున్న రోజుల్లో మండలంలో మరిన్ని చేరికలు ఉంటాయని నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడు శ్రీకాంత్, మహిళా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు లహరి, ఏఎంసీ డైరెక్టర్ వినోద్, విజయ్ కుమార్, ఆత్మ కమిటీ డైరెక్టర్ కనుకయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ అజ్జు, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు ఎల్లంతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అసెంబ్లీ సాక్షిగా బిఆర్ఎస్ కుల దురహంకారం!

### నేలకొండపల్లిలో ఉద్రిక్తత: ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మ దహనం

### బహిరంగ క్షమాపణ చెప్పకుంటే ఇల్లు ముట్టడిస్తాం: జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు హెచ్చరిక

### దళిత ద్రోహి బీఆర్ఎస్‌కు కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు లేదు: మండల అధ్యక్షుడు కొడాలి గోవింద్

### వీధి రౌడీలా ఎమ్మెల్సీ ప్రవర్తన.. యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ



**ప్రజా వాయిస్ ఖమ్మం జిల్లా:**
రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న దళిత బిడ్డ, శాసనసభ గౌరవ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను అసెంబ్లీ గేటు సాక్షిగా బరితెగించి దూషించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం, ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలకేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన నిప్పులు చెరిగారు. ప్రజాస్వామ్య దేవాలయం ముంగిట ఎమ్మెల్సీ హోదాను సైతం మరిచి వీధి రౌడీలా, గూండాలా ప్రవర్తించిన తాతా మధు శాసనమండలి సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని, ఆయనపై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నేలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొడాలి గోవింద్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నయవంచక వైఖరిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ వస్తే దళితుడినే తొలి ముఖ్యమంత్రిని చేస్తామని పచ్చి అబద్ధాలు చెప్పి, అధికారంలోకి వచ్చాక దళిత ఉప ముఖ్యమంత్రినే అవమానకరంగా పదవి నుంచి బర్తరఫ్ చేసిన దుర్మార్గ చరిత్ర కేసీఆర్‌ది కాదా అని సూటిగా నిలదీశారు. పేద దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని నమ్మించి గొంతు కోసి, ఎన్నికల వేళ దళితబంధు పేరుతో ఓట్లు దండుకోవాలని చూసిన బీఆర్ఎస్ నాయకులకు దళితుల గురించి మాట్లాడే ఏ అర్హత లేదన్నారు. ఎలాంటి ఆర్భాటాలు లేకుండా దళిత నేతను గౌరవించి రాష్ట్రంలోనే అత్యున్నత శాసనసభ స్పీకర్ పీఠంపై కూర్చోబెట్టిన ఘనత ఇందిరమ్మ రాజ్యం తెచ్చిన కాంగ్రెస్ పార్టీదని గుర్తుచేశారు. అలాంటి కాంగ్రెస్ పార్టీని, రాజ్యాంగ స్థానాల్లో ఉన్న నేతలను వేలెత్తి చూపే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదని మండిపడ్డారు. ఆది నుంచీ తాతా మధుకు దళితులంటే చులకన భావమని, ఆయన రక్తంలోనే అహంకారం నిండిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్‌ను అవమానించడం అంటే యావత్ దళిత సమాజాన్ని అవమానించడమేనని, వెంటనే తాతా మధు జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ఆయన ఇంటిని ముట్టడించి తీరుతామని తీవ్రస్థాయిలో హెచ్చరించారు.అనంతరం ఈ దుశ్చర్యకు నిరసనగా నేలకొండపల్లి మండల కేంద్రంలోని పొట్టి శ్రీరాములు సెంటర్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేశారు. తాతా మధు తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని, క్షమాపణ చెప్పాలని పెద్దపెట్టున నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## హామీలు ఘణం అమలు శూన్యం

### హామీలు ఇచ్చారుఓట్లు తెచ్చుకున్నారుఇప్పుడు అమలును మరిచారు

### ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి

### మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో కొల్లాపూర్‌లో మహా బైక్ ర్యాలీ నిరసన కార్యక్రమం



**ప్రజా వాయిస్.. వీపనగండ్ల**
వనపర్తి జిల్లాలోనిచిన్నంబావి, వీపనగండ్ల, పానగల్ మండల పరిధిలోని వివిధ గ్రామాల బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, సీనియర్ కార్యకర్తలు కొల్లాపూర్ లో నిర్వహించే మహా బైక్ ర్యాలీ నిరసన కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ఆరోపించారు. హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ ఆయన ఆధ్వర్యంలో కొల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని వివిధ గ్రామాలలో వివిధ మండలాలలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు కొల్లాపూర్‌లో భారీ మహా బైకు ర్యాలీలో అధిక సంఖ్యలో పాల్గొని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో మహా బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే ఈ నిరసన చేపట్టినట్లు మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి తెలిపారు. హామీలు అమలు చేయాలి.. ప్రజలకు న్యాయం చేయాలి.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ.. హామీలు అమలు చేయడంలో జాప్యం ఎందుకు? ప్రజలకు ఇచ్చిన మాట ఎప్పుడు నిలబెట్టుకుంటారు? అంటూ నిరసనకారులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వెయ్యి రోజుల పాలనలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగలేదని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం, ఎన్నికల హామీల అమలు కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని బీరం హర్షవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నంబావి మండలశీ, వీపనగండ్ల మండలం, పనగల్ మండల పరిధిలోని వివిధ గ్రామాల సీనియర్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో ఈ మహా బైక్ ర్యాలీ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గణేష్ మండప నిర్వాహకులతో సమన్వయ సమావేశం

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**
కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలు, సంప్రదాయాలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు గణేష్ మండప నిర్వాహకులతో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సమగ్ర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నితికా పంత్ మండప నిర్వాహకులకు పలు ముఖ్యమైన సూచనలు చేశారు.నిబంధనలకు అనుగుణంగా డీజే, సౌండ్ సిస్టమ్ వినియోగించాలని, ప్రతి మండపం వద్ద 24 గంటలు వాలంటీర్లు అందుబాటులో ఉండాలని, తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండప నిర్మాణంలో నాణ్యమైన వస్తువులు, నాణ్యమైన వైర్లు, విద్యుత్ పరికరాలు మాత్రమే వినియోగించాలని, ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. రాత్రి 10 గంటల తర్వాత మైక్, సౌండ్ సిస్టమ్, డీజేలు వినియోగించరాదని, మండపాల వద్ద టపాసులు, జూదం, లక్కీ డ్రాలు, బలవంతపు చందాలు వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు తావివ్వరాదని స్పష్టం చేశారు.మద్యం సేవించి మండపాల వద్దకు రావొద్దని, అగ్ని ప్రమాదాల నివారణకు నీరు, ఇసుక వంటి భద్రతా ఏర్పాట్లు తప్పనిసరిగా ఉంచాలని సూచించారు. సోషల్ మీడియా వదంతులను నమ్మవద్దని, అనుమానాస్పద సమాచారం కనిపిస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలని, అత్యవసర పరిస్థితుల్లో 112కు సమాచారం అందించాలని కోరారు. ఉత్సవాలను ప్రశాంతంగా, అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు నిర్వాహకులు, భక్తులు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.



# అనుమతి లేని శ్రీధృతి ప్రైవేటు స్కూలును మూసివేయండి

**నిర్లక్ష్యంగా ఉన్న హయత్ నగర్ మండల విద్యాధికారి శ్రీనివాస్ పై చర్యలు తీసుకోండి**

**పలమార్లు కంప్లైంట్ చేసిన గాని పట్టించుకోని ఎంఈఓ రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయి.. ఎంఈఓ శ్రీనివాస్**

**నిబంధనలు ఉల్లంఘించిన శ్రీధృతి స్కూల్ పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం - డీఈఓ**

**ప్రజావాణిలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి కి పిర్యాదు చేసిన బి.సి చైతన్య వేదిక విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు నగేష్ సూర్యవంశం**

హయత్ నగర్ మండల విద్యాధికారి విద్యాధికారి శ్రీనివాస్ పై క్రమశిక్షణా చర్యలు తీసుకొని హయత్ నగర్ మండలం, సాహెబ్ నగర్ కలాన్, భవానీ ఎన్క్లేవ్‌లో అనుమతులు లేకుండా నడుస్తున్న ఉన్న శ్రీ ధృతి ప్రైవేటు పాఠశాలను మూసివేయాలని సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు బి.సి చైతన్య వేదిక విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు నగేష్ సూర్యవంశం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీ ధృతి ప్రైవేటు పాఠశాల మౌలిక సదుపాయాలు, అనుమతులు లేకుండా నడుస్తుందని, పాఠశాలను మూసివేయాలని 01 ఆగస్టు 2026, 19 ఆగస్టు 2026 తేదీలలో ఎంఈఓ కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయంపై ఎంఈఓ ని ఫోన్ కాల్ ద్వారా సంప్రదించగా ఎంఈఓ మాట్లాడుతూ మాపై రాజకీయ ఒత్తిడి ఉందని.. అందుకే స్కూల్ ని మరలా క్లోజ్ చేయంలేకపోతున్నామని సమాధానం చెబుతూ నెలరోజులుగా దాటవేస్తున్నారని, ఆధారాలతో సహా కలెక్టర్ కు ఫిర్యాదు చేసామన్నారు.. ఇదే విషయమై గతంలో ఈ స్కూల్ అనుమతులు లేకుండా నడుస్తున్నందుకు జూలై ఎనిమిదో తారీకు సంబంధిత









అధికారులు సీజ్ చేసినప్పటికీ.. ఎంఈఓ ఆదేశాలు బేఖాతరు చేసి మరుసటి రోజే స్కూల్ యాజమాన్యం ఓపెన్ చేసిందని కలెక్టర్, డీఈఓ కి పూర్తి వివరాలతో గుర్తు చేయగా .. కలెక్టర్, డీఈఓ స్పందిస్తూ స్కూల్ పై చట్టపరంగా కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరపవలసిందిగా.. పూర్తి నివేదికను, శ్రీ ధృతి పాఠశాల అనుమతి వివరాలు, ఎన్.ఓ.సి కాపీలు, పూర్తి అనుమతి రుజువు పత్రాలను వెంటనే ప్రజలకు అందుబాటులో ఉంచాలని, విద్యార్థుల భవిష్యత్తును, తల్లిదండ్రుల ఆశలను నాశనం చేస్తున్న ఇలాంటి ప్రైవేటు పాఠశాలలను గుర్తించి తక్షణమే మూసివేయాలని బి.సి చైతన్య వేదిక విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు నగేష్ సూర్యవంశం డిమాండ్ చేశారు.

# బీజేపీ నేతల హౌస్ అరెస్ట్

**మహాధర్నకు వెళ్లనివ్వకుండా ముందస్తు అరెస్టు..**
**ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి..**
**బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్..**

ప్రజా వాయిస్ జహీరాబాద్:
ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన విద్యార్థి మహాధర్నాకు వెళ్లకుండా సోమవారం నాడు బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు. అనంతరం వారిని చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించడంలో నిర్లక్ష్యం



చేస్తోందని ఆరోపించారు. అంతేకాకుండా సుమారు రూ.15 వేల కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ఇబ్బందుల్లో పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందకపోవడంతో విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యార్థుల సమస్యలపై నిరసన తెలిపేందుకు వెళ్తున్న బీజేపీ నాయకులను పోలీసులు అడ్డుకోవడం అప్రజాస్వామిక చర్య అని జగన్నాథ్ విమర్శించారు. అదేవిధంగా ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన సమస్యపై శాంతియుతంగా పోరాటం చేస్తున్న నాయకులను అరెస్ట్ చేయడం సరికాదని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించి బకాయిలను తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అరెస్ట్ అయిన వారిలో జగన్నాథ్, సురేష్, ప్రతాప్ రెడ్డి, నరేష్, నాగేష్ తదితరులు ఉన్నారు..



# ప్రజావాణి దరఖాస్తుల త్వరిత పరిష్కారానికి ఆదేశం

ప్రజా వాయిస్ ఆసిఫాబాద్
కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని ఎన్ఐసి సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జైనూర్ మండలం ఊషేగం గ్రామానికి చెందిన జయ కళాబాయి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, కాగజ్‌నగర్ మండలం కోయవాగుకు చెందిన కాంపెల్లి అరుణ ఒంటరి మహిళ పింఛన్ మంజూరు చేయాలని దరఖాస్తులు సమర్పించారు. రెబ్బెన మండలం వంకులం గ్రామానికి చెందిన జూపాక పోచం తన పట్టా భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, చింతలమానేపల్లి మండలం బూరేపల్లికి చెందిన జాడి భగవాన్ తప్పుగా నమోదైన పట్టా భూమిని తన పేరిట సవరించి పాసు పుస్తకం ఇప్పించాలని కోరారు. కాగజ్‌నగర్ మండలం అంకుశాపూర్‌కు చెందిన నగోషా యమునబాయి వితంతు పింఛన్ కోసం, రెబ్బెన మండలం గోలేటి టౌన్షిప్‌కు చెందిన గుండేటి స్వరూప, జైనూర్ మండలం ఊషేగాంకు చెందిన కోవ కమలాబాయి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తులు అందజేశారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరించే చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.



# వెయ్యి రోజుల సీఎం రేవంత్ రెడ్డి విఫల పాలనపై ప్రజావాణిలో బీఆర్ఎస్ వినతిపత్రం

ప్రజా వాయిస్, సంగారెడ్డి :
వెయ్యి రోజుల సీఎం రేవంత్ రెడ్డి విఫల పాలనకు నిరసనగా, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సూచనల మేరకు బీఆర్ఎస్ నాయకులు ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రాలు అందజేశారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పటికైనా ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పాండుకు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా, నాలుగు మండల కేంద్రాల్లోని ప్రజావాణి కార్యక్రమాల్లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ సీడీసీ చైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి, నరహరి రెడ్డి, చింత సాయినాథ్, డాక్టర్ శ్రీహరి, మందుల వరలక్ష్మి, మనోహర్ గౌడ్, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గోశాల , వేద పాఠశాల నిర్మాణానికి స్థలం కేటాయించండి



ప్రజా వాయిస్ - మంచిర్యాల
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణ ప్రాంతంలోని బ్రాహ్మణ కుటుంబాల ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు శాశ్వత వేదిక కల్పించడంతో పాటు గోశాల, వేద పాఠశాల, యజ్ఞశాల , వేద గాయత్రీ మాత ఆలయం నిర్మాణం కోసం తగిన స్థలాన్ని కేటాయించాలని బెల్లంపల్లి బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షులు వి.ఎల్.ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ బెల్లంపల్లి మండలంలో దాదాపు 300కు పైగా బ్రాహ్మణ కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. అయితే సంఘం ఆధ్వర్యంలో ఏవైనా సామాజిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సొంతంగా స్థలం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. ఇందుకోసం ప్రభుత్వం తమ విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించి బెల్లంపల్లి ప్రాంతంలో తగిన స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ విషయమై ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో పాటు ప్రస్తుత ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు కూడా వినతిపత్రాలు సమర్పించినట్లు సమితి సభ్యులు తెలిపారు. తాజాగా ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను కలిసి తమ సమస్యను వివరించినట్లు పేర్కొన్నారు. వినతిపత్రంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి, తమ విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎస్ ప్రత్యేక సలహాదారు కొమ్మెర లక్ష్మణ్, సభ్యులు జగన్మోహన్, మనోజ్ పాండే తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల సమస్యల పరిష్కారానికి వినతి

ప్రజా వాయిస్ కగజ్ నగర్
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించి, అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించాలని కోరుతూ మైత్రీ వికలాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు సోమవారం కాగజ్‌నగర్ మండల తహసిల్దార్ మధుకర్‌కు వినతి పత్రం



అందజేశారు. వికలాంగులకు అవసరమైన ధ్రువపత్రాలు, పింఛన్లు, ఉపాధి అవకాశాలు, ఇతర సంక్షేమ పథకాల విషయంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని సంఘం ప్రతినిధులు కోరారు. ఆర్థిక సహాయం, ఇతర సౌకర్యాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

# రైలులో నిషేధిత గడ్డి మందు స్వాధీనం




ప్రజా వాయిస్ కగజ్ నగర్
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం బల్లార్షా నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న రామగిరి ఎక్స్‌ప్రెస్ (17004)లో అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గడ్డి మందును కాగజ్‌నగర్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ముందస్తు సమాచారం మేరకు ప్లాట్‌ఫామ్ నంబర్-2 వద్ద ఆర్‌పీఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మొత్తం 81 గడ్డి మందు ప్యాకెట్లు, 5 లీటర్ల సామర్థ్యం కలిగిన ఐదు క్యాన్లు, 1 లీటర్ సామర్థ్యం కలిగిన ఐదు క్యాన్లు లభ్యమయ్యాయి. స్వాధీనం చేసుకున్న మందును కాగజ్‌నగర్ వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ రైల్వే ఆర్‌పీఎఫ్ ఎస్ఐ ప్రాచీ దేవి, ఏఎస్ఐ ఆర్. దాసు, సిబ్బంది కమలేష్ కుమార్ సింగ్, ప్రేమానంద్, రైల్వే స్టేషన్ ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్ మీణా తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి, 22ఏ అక్రమాలపై అసెంబ్లీ ఎదుట భాజపా ఎమ్మెల్యేల నిరసన



ప్రజా వాయిస్ కగజ్ నగర్
హైదరాబాద్: అసెంబ్లీ వర్షాకాల సమావేశాల ప్రారంభం సందర్భంగా భారతీయ జనతా పార్టీ శాసనసభ పక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో భాజపా ఎమ్మెల్యేలు భూభారతి, 22ఏ భూ అక్రమాలపై నిరసన ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించిన ఎమ్మెల్యేలు ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ ప్రదర్శన చేపట్టారు. గతంలో ధరణి అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించినా ఇప్పటివరకు నివేదిక విడుదల చేయలేదని, అక్రమార్కులతో మిలాఖత్ అయిన ప్రభుత్వ పెద్దలు అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. భూభారతి, 22ఏ అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అనంతరం నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ అమరవీరుల స్థూపం నుంచి అసెంబ్లీ ప్రాంగణంలోకి ప్రవేశించారు.